


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 19-12-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 85 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### నేను ఆనాడే చెప్పాను

## కాంగ్రెస్ నేతలు శిక్షార్హులని

- ఎవ్వరూ ఊహించి ఉండరు
- అసత్య ఆరోపణలతో 'సుప్రీం'నే తప్పుపట్టిస్తున్నారు
- ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో చోటుచేసుకున్న జాప్యంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనదైన శైలిలో స్పందించారు. ఈ కేసులో కాంగ్రెస్ నేతలకు శిక్ష పడుతుందని ఎవ్వరూ ఊహించి ఉండరని ఎద్దేవా చేశారు. ముంబైలో మంగళవారం జరిగిన రిపబ్లిక్ సమ్మిట్‌లో ప్రధాని మాట్లాడుతూ... 1984 నాటి సిక్కుల ఊచకోత కేసులో కాంగ్రెస్ నేతలకు శిక్ష పడుతుందని, బాధితులకు న్యాయం జరుగుతుందని, నాలుగేళ్ల క్రితం ఎవరూ ఊహించి ఉండరు... అని పేర్కొన్నారు. సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో కాంగ్రెస్ నేత సజ్జన్ కుమార్‌కు జీవిత ఖైదు విధిస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించిన మరుసటి రోజే ప్రధాని మోదీ ఇలా వ్యాఖ్యానించడం గమనార్హం. కాగా రాఫెల్ ఒప్పందంపై ఇటీవల సుప్రీంకోర్టు తరువాయి 2లో..

### "టైమ్‌లెస్ లక్ష్మణ్" పుస్తకావిష్కరణ



ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు ఆర్.కె. లక్ష్మణ్‌పై ఆధారితమైన "టైమ్‌లెస్ లక్ష్మణ్" గ్రంథాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలం అనే సరిహద్దు లేనటువంటి ప్రయాణంలో ఒక భాగం తరువాయి 2లో..

### నష్ట తీవ్రతను

# తగ్గించగలిగాం

- ఆర్టీజీఎస్‌తో కచ్చితమైన సమాచారాన్ని ఇస్తున్నాం
- మరింతగా బలహీనపడిన 'పెథాయ్'
- అల్పపీడనంగా మారి ఒడిశాలో కేంద్రీకృతం
- కాకినాడలో 22 మంది మత్స్యకారుల ఆచూకీ గల్లంతు
- నేవీ, కోస్టు గార్డులు గాలింపు చర్యలు
- మధ్యాహ్న భోజన పథకం ద్వారా బాధితులకు భోజనాలు
- తుపాను ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే




కాకినాడ: ముందస్తు జాగ్రత్త చర్యలతో పెథాయ్ తుపాను నష్ట తీవ్రతను తగ్గించగలిగామని సీఎం చంద్రబాబు అన్నారు. అప్రమత్తతపై ఐవీఆర్ఎస్, ఆర్టీజీఎస్ ద్వారా 9లక్షల మందికి సందేశాలు పంపామని తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐఎండీ ఇవ్వలేని సమాచారాన్ని సైతం మన సొంత వ్యవస్థతో ఇచ్చామన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోగానే జనరేటర్ల సాయంతో విద్యుత్‌ను సరఫరా చేశామని చెప్పారు. గతంలో తుపాను ఎక్కడ తరువాయి 2లో..

### సూరి హత్య కేసులో

## భానుకి యావజ్జీవం

**రూ. 20 వేల జరిమానా .. మన్మోహన్‌కు ఐదేళ్లు కారాగారం**
**వెల్లడించిన నాంపల్లి కోర్టు**



హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్దెల చెర్వు సూరి హత్య కేసులో నాంపల్లి కోర్టు తుది తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు భానుకిరణ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రెండో నిందితుడు మన్మోహన్‌కు ఐదేళ్ల కారాగార శిక్ష విధించింది. ఈ కేసులో మరో నలుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. సూరి హత్య కేసులో గత ఆరున్నరేళ్లుగా భానుకిరణ్ చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. అయితే, మన్మోహన్ కూడా జైలులో ఎనిమిదేళ్లుగా రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. భానుకిరణ్‌కు యావజ్జీవం, మన్మోహన్‌కు ఐదేళ్లు జైలు శిక్ష విధించిన న్యాయస్థానం.. ఈ కేసులో నిందితులుగా ఉన్న వంశీధర్, వెంకటరమణ, సుబ్బయ్య, హరిలను నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసు విచారణలో సీఐడీ పోలీసులు 93 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు.

2011 జనవరి 4న తన అనుచరుడు మల్లిశెట్టి భానుకిరణ్ చేతిలో సూరి హత్యకు గురైన సంగతి తెలిసిందే. సూరితోపాటు కారులో ప్రయాణిస్తున్న భానుకిరణ్ యూసఫ్‌గూడ ప్రాంతానికి వచ్చిన తర్వాత తనవద్ద ఉన్న దేశవాళీ తుపాకీతో కాల్చి చంపి పరారయ్యాడు. తెలుగుదేశం నాయకుడు పరిటాల రవి హత్యకేసులో ప్రధాన నిందితుడు సూరి తన అనుచరుడి చేతిలోనే హతమవ్వడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

కేసు దర్యాప్తు చేపట్టిన సీఐడీ 2012 ఏప్రిల్ 21వ తేదీన జహీరాబాద్ వద్ద ఒక దాబాలో భానుకిరణ్‌ను అరెస్టు చేసింది. సూరిని హత్య చేసిన తర్వాత మధ్యప్రదేశ్ పారిపోయిన భానుకిరణ్ సియోని ప్రాంతంలో తలదాచుకున్నాడు. అతని నుంచి తుపాకీ, మూడు సెల్‌ఫోన్లు, బ్యాంకు ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి భాను జైల్లోనే ఉన్నాడు. బెయిల్ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. మద్దెలచెర్వు సూరి హత్య కేసు దర్యాప్తు చేసిన సీఐడీ అభియోగపత్రాలు దాఖలు చేసింది. దీనిపై నాంపల్లిలోని సీఐడీ న్యాయస్థానం విచారణ జరిపి మంగళవారం తుదితీర్పు వెలువరించింది.

## జీఎస్ఎల్వీ ఎఫ్-11 కౌంట్‌డౌన్ ప్రారంభం



శ్రీహరికోట: ఉపగ్రహ ప్రయోగాల్లో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం (ఇస్రో) మరో ఉపగ్రహ ప్రయోగానికి సన్నద్ధమైంది. ఇందులో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్11 వాహక నౌక ద్వారా జీశాట్-7ఏ ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలో ప్రవేశ పెట్టడానికి కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించింది. మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు

## ఇల వైకుంఠం తిరుమల

- తెలుగు రాష్ట్రాల్లో వైకుంఠ శోభ
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



వార్త 2వ పేజీలో..

## రాజ్యసభ బుధవారానికి వాయిదా



న్యూఢిల్లీ: ఎలాంటి కార్యకలాపాలూ లేకుండానే వరుసగా ఐదో రోజు రాజ్యసభ వాయిదా పడింది. కాంగ్రెస్ సభ్యులు రఫేల్ ఒప్పందంపై చర్చకు పట్టుబట్టగా.. డీఎంకే, అన్నాడీఎంకే ఎంపీలు తమిళనాడు- కర్ణాటక మధ్య కావేరీ జల వివాదంపై చర్చ చేపట్టాలని ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనల మధ్యే రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు సభను బుధవారానికి వాయిదా వేశారు. రఫేల్ ఒప్పందంలో ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఎందుకు సమర్పించిందో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షం సభా హక్కుల తీర్మానం ప్రవేశపెట్టింది.

దీనిపై చర్చ చేపట్టదల్చుకున్నట్లు ఛైర్మన్ వెంకయ్య తరువాయి 2లో..




## ఏపీకి న్యాయం చేయాలి

- పుట్టిన రోజే రామ్మోహన్ నాయుడు నిరాహార దీక్ష
- పార్లమెంట్ ఆవరణలో తెదేపా ఎంపీల ఆందోళన
- వంగపండు వేషధారణలో ఎంపీ శివప్రసాద్ విమర్శలు
- తెదేపా ఎంపీలను కలిసిన వారణాసి విద్యార్థులు



దిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ పార్లమెంట్ ఆవరణలో తెదేపా ఎంపీలు నిరసన కొనసాగించారు. గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శించి మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వంగపండు వేషధారణలో జానపద పాటలు పాడుతూ ఎంపీ శివప్రసాద్ మోదీపై విమర్శలు గుప్పించారు.

**పుట్టిన రోజున రామ్మోహన్ నాయుడు నిరాహార దీక్ష**

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎంపీ రామ్మోహన్‌నాయుడు పార్లమెంట్ ఆవరణలో నిరాహార దీక్షకు దిగారు. విభజన హామీల అమలులో తరువాయి 2లో..





విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం నందు ప్రభుత్వ విప్ గణబాబు చేతులు మిదిగా 67 68 వార్డులకు చెందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ లను మొత్తం 6,14,950/- అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు బాలసుబ్రహ్మణ్యం, పి. మంగ లక్ష్మీ , వార్డు నాయకులు ఎన్. సత్తిరాజు, కొల్లి అప్పారావు, కుమార్ మొదలగు వారు పాల్గొన్నారు.



వైకుంఠ ఏకాదశి సందర్భంగా కప్పరాడ క్షేత్రంలో కొలువైయున్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసిన నగర బిజెపి ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, తదితరులు

# మానవుడే దేవుడు.. సమాజమే దేవాలయం

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా కె.కె.రాజు ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ



విశాఖపట్నం : శ్రీ శ్రీ శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ముక్కోటి ఏకాదశి శుభ సందర్భంగా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో 38వ వార్డు ఎన్.జి.జి.ఓ.ఎస్. కోలని, కప్పరాడ, శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి గుడి దగ్గర వేలాదిమంది భక్తులకు పులిహోర, దద్దోజనం మరియు బాదం పాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యాన్ని వివరించారు. భక్తులు యధాశక్తి భావనలతో వైష్ణవ దేవాలయాలలో స్వామి వారిని దర్శించుకుని ముక్తిని పొందాలని వివరించారు. ప్రతీ మనిషి ఆధ్యాత్మిక భావనతోనే మానసిక ప్రశాంతతను పొందగలుగుతారని, అందుకు ధనుర్మానసం, దేవాలయ దర్శనం అత్యంత ప్రాధాన్యత పొందుతుందని తెలిపారు. నిత్యం దైవనామ స్మరణతో సమాజ హితానికి పాల్పడిన ప్రతి మానవుడూ దేవుడేనని అన్నారు. మానవుడే దేవుడు.. సమాజమే దేవాలయం.. ఈ విషయాన్ని మదినెరిగి తోటివారికి సహాయ కార్యక్రమాలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో 38వ వార్డు అధ్యక్షుడు బొడ్డు ఎర్రు నాయుడు, ఉత్తర నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నంభాళ్ళ ఈశ్వరావు, కిరణ్ రాజు, ఎన్.రవికుమార్, ఐ.రవికుమార్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.





పెథాయి తూఫాన్ ప్రభావం వల్ల విశాఖ జిల్లా సౌత్ నియోజకవర్గం 25వ వార్డ్ లో పర్యటించిన వైస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ కోలా. గురువులు పర్యటన అనంతరం ఉమా నీలకంటేశ్వరుని ఆలయాన్ని దర్శించుకున్నారు అలాగే సీనియర్ నాయకులు టి. కృష్ణ , జిల్లా సెక్రెటరీ ఏ. మసేను, యూత్ ప్రెసిడెంట్ సిహెచ్. అప్పలరాజు, బిసి సెల్ అధ్యక్షులు డి. తాతారావు, యూత్ యువజన కార్యదర్శి ఎం.ఆదినారాయణ, యూత్ యువజన కార్యదర్శి సిహెచ్. అప్పారావు, వార్డ్ నాయకులు ఏ. రాజు, బుత్ ప్రెసిడెంట్ సిహెచ్. సూరి పాల్గొన్నారు.

# ఇల వైకుంఠం తిరుమల



తిరుమల : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉత్తరద్వార దర్శనానికి బారులు తీరారు. శ్రీమన్నారాయణుడికి ప్రీతికరమైన సుదినం వైకుంఠ ఏకాదశి. సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన కాలం ఇది. దేవతలకు బ్రహ్మ మూహూర్త కాలం వైకుంఠ ఏకాదశి. వైకుంఠంలో ఉత్తర ద్వారం నుంచి విష్ణుమూర్తిని దేవతలు దర్శించుకునే రోజు. ఈ పర్వదినం సందర్భంగా వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

తిరుమలలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారిని మంగళవారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు శ్రీవారి సేవలో పాల్గొన్నారు. తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భద్రాచలం తదితర వైష్ణవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.









## రాష్ట్రానికి నెదర్లాండ్స్ సాంకేతిక సాయం

### వివిధ రంగాల్లోనూ పెట్టుబడులు

### ముఖ్యమంత్రి చంద్రబాబుతో 17 సంస్థల ప్రతినిధుల భేటీ

అమరావతి: ఐటీ, ఐటీఈఎస్, క్రీడలు, మౌలిక సదుపాయాలు, విద్యుత్ తదితర రంగాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, సాంకేతిక సాయాన్ని అందించేందుకు నెదర్లాండ్స్‌కు చెందిన వివిధ సంస్థలు ఆసక్తి కనబరిచాయి. ఈ విషయాన్ని మంగళవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి నెదర్లాండ్స్ రాయబారి మార్టెన్ వాన్ డెన్‌బెర్గ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టాలని భావిస్తున్న 17 సంస్థల ప్రతినిధులను డెన్‌బర్గ్ ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నానని ముఖ్యమంత్రికి చెప్పిన డెన్‌బెర్గ్, నెదర్లాండ్స్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు అనేక అంశాల్లో సారూప్యత ఉందన్నారు. విద్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి ఉందని, వాటర్ వేస్, వేస్ట్ టు ఎనర్జీ, వేస్ట్ వాటర్, యానిమల్ న్యూట్రిషన్, స్మార్ట్ సిటీ, సాఫ్ట్‌వేర్, ఇంథన రంగాల్లో ఈ సంస్థలకు అనుభవం ఉందని డెన్‌బర్గ్ ముఖ్యమంత్రికి తెలిపారు.

***దేశంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్***

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను నెదర్లాండ్స్ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. సమర్ధత, ఆకర్షణ, సులభతర వాణిజ్యం నెదర్లాండ్స్ సొంతమని, అలాగే ఆంధ్రప్రదేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజెనెస్‌లో భారతదేశంలోనే ముందుదని చెప్పారు. ఐటీ, ఐవోటీ, ఇంథన రంగాల్లో తమ రాష్ట్రం దూసుకుపోతోందని అన్నారు. సాంకేతిక సాయంతో తుఫాన్ల గమనాన్ని ముందే పసిగట్టి నష్టనివారణ చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఉత్తమ మానవ వనరులు, సులభతర వాణిజ్య అవకాశాలు, సమృద్ధిగా విద్యుత్-నీరు ఆంధ్రప్రదేశ్‌కు కలిసొచ్చే అంశాలుగా చెప్పారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టిపెట్టడం ద్వారా యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించగలిగామని అన్నారు. ప్రాజెక్టులలో సెన్సర్లు ఏర్పాటు చేయడం ద్వారా నీటినిల్వల గణాంకాలు తెలుసుకోగలుగుతున్నామని చెప్పారు. ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి తెలిపారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం నూరు శాతం చేపట్టడం తమ లక్ష్యంగా, ప్రపంచంలో ఎక్కడా లేనట్టు విస్తారంగా సహజ సిద్ధమైన సాగును రాష్ట్రంలో చేపట్టామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారతదేశ వృద్ధి కన్నా అధికంగా రెండంకెల వృద్ధితో ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు నడిపిస్తున్నామని, నూతన రాష్ట్రంలో నూతన రాజధాని అమరావతిని నిర్మించుకుంటున్నామని చెప్పారు. అమరావతిలో మౌలిక వసతుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని, రాష్ట్రమంతా ఎల్‌ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 16 లక్షల సోలార్ పంపుసెట్లు అమర్చడం ద్వారా వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ ఆదా అవుతోందని ముఖ్యమంత్రి చెప్పారు.

***రియల్ టైమ్ గవర్నెన్స్ మరెక్కడా లేదు***

దేశంలో ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ తరహాలో పరిష్కార వేదిక కాల్ సెంటర్ లేదని, రియల్ టైమ్ గవర్నెన్స్ తమ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకమని ముఖ్యమంత్రి చెప్పారు.

**మొదటి పేజీ తరువాయి**

# నేను ఆనాడే చెప్పాను

వెలువరించిన తీర్పుపైనా కాంగ్రెస్ పార్టీ పార్టీ లక్ష్యంగా ప్రధాని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అవినీతి ఆరోపణలు చేస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ఇదే తొలిసారి. రాఫెల్ ఒప్పందం నిజాయితీగా, పారదర్శకంగా జరిగిందని సుప్రీంకోర్టు వారికి స్పష్టంగా తీర్పు చెప్పింది. ఇలా జరుగుతుందని నాలుగేళ్ల క్రితం వరకు ఎవరూ ఊహించి ఉండరు... అని ఆయన వ్యాఖ్యానించారు. అగాస్టావెస్ట్‌ల్యాండ్ కేసుపైనా ప్రధాని మోదీ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ కేసులో కీలక నిందితుడు క్రిస్టియన్ మైఖేల్ ఒకనాటికి భారత్‌లో ఉంటాడని నాలుగేళ్ల క్రితం ఎవరూ ఊహించి ఉండరు. ఇప్పుడు ఈ వ్యవహారం కూడా కొలిక్కి వస్తోంది... అని ప్రధాని పేర్కొన్నారు.

## "టైమ్‌లెస్ లక్ష్మణ్" పుస్తకావిష్కరణ

అయినందుకు తాను సంతోషిస్తున్నట్లు చెప్పారు. లక్ష్మణ్ కృతుల అపార ఖజానా లోకి తొంగి చూసేందుకు ప్రస్తుతం ఒక అవకాశం లభ్యం కావడం పట్ల ఆయన హర్షాన్ని వెలిబుచ్చారు. దశాబ్దాల గుండా సాగినటువంటి లక్ష్మణ్ కృతులను అధ్యయనం చేయడం అప్పటి సామాజిక, ఆర్థిక స్థితిగతులను, ఇంకా సామాజికీకరణాన్ని అర్థం చేసుకొనేందుకు ఒక చక్కని మార్గం అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రయత్నం ఒక్క లక్ష్మణ్ గురించో, లేదా ఆయనను స్మరించుకోవడానికో చేసిన ప్రయత్నం కాదని, లక్ష్మణ్ లోని ఒక చిన్న భాగం కోట్లాది ప్రజలలో ఇప్పటికీ మనుగడ సాగిస్తోందని ప్రధాన మంత్రి అన్నారు. లక్ష్మణ్ ఆలంబనగా తీసుకున్న సగటు మనిషి కాలం అనే ఎల్ల లేని వాడని, భారతదేశం అంతటా అతడి ఉనికి ఉందని ప్రధాన మంత్రి చెప్పారు. భారతదేశం లో నివసించేవారు వారందరూ, మరి అలాగే అన్ని తరాలకు చెందిన ప్రజలు ఆయన తో మమేకం కాగలుగుతారని శ్రీ మోదీ అన్నారు. పద్మ పురస్కారాల ప్రక్రియను ఏ విధంగా సామాన్య మానవుడి పట్ల శ్రద్ధ వహించేటట్టు మార్పు చేయడం జరిగిందో ప్రధాన మంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు.

# నష్ట తీవ్రతను తగ్గించగలిగాం

తీరం దాటుతుందే తెలియని పరిస్థితి ఉండేదని.. ఇప్పుడు ఆర్టీజీఎస్‌తో కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా తుపాను బాధితులకు భోజనాలు ఏర్పాటు చేశామని సీఎం వివరించారు.

నవంబర్‌లోపే పంట చేతికందేలా చూసుకోవాలి

అక్టోబర్, డిసెంబరు నెలల్లో తుపానులు వస్తున్నాయని.. వాటి బారిన పడకుండా ఉండేందుకు వీలుగా తొలి పంట నవంబర్‌లోపే చేతికందేలా రైతులు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. పెథాయ్ తుపాను ప్రభావంతో విశాఖ జిల్లా అరకు ప్రాంతంలో అత్యధికంగా 23 సె.మీ, తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవులో సుమారు 17 సె.మీ వర్షపాతం నమోదైందని చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో 80-85 కి.మీ వేగంతో గాలులు వీచాయని.. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వర్షాలు బాగా పడ్డాయని చెప్పారు. 25 సెల్‌టవర్లు పాడైతే వాటిని యథాస్థితికి చేర్చారని, దెబ్బతిన్న రోడ్లను గంటల వ్యవధిలోనే అధికారులు పునరుద్ధరించారని చంద్రబాబు వివరించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన ప్రాంతాల్లో 129 జనరేటర్లను, తాగునీటి కోసం 140 ట్యాంకర్లను వినియోగించామన్నారు. మత్స్యకారులకు చెందిన 25 బోట్లు దెబ్బతిన్నట్లు గుర్తించామని చెప్పారు. అధికారులంతా సమన్వయంతో వ్యవహరించి పరిస్థితిని చక్కదిద్దారని సీఎం ప్రశంసించారు.

రైతులకు కన్నీళ్లే

తుపాను ధాటికి పిఠాపురం నియోజకవర్గంలోని దుర్గాడ, చేబ్రోలు, విజయనగరం, మల్లవరంలో తీవ్రంగా పంట నష్టం వాటిల్లింది. వరి, ఉద్యానవన పంటలు నీట మునగడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఉల్లి, మిర్చి, పత్తి, మినప పంటలకు భారీగా పెట్టుబడి పెట్టామని, ఇంత నష్టం జరిగినా అధికారులు తమను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కోస్తాంధ్రను వణికించిన పెథాయ్ ప్రస్తుతం కాకినాడ - యానాం మధ్య తీరం దాటింది. ఇది క్రమంగా బలహీనపడుతోంది. ప్రస్తుతం ఒడిశావైపు పయనిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన వద్ద మధ్యాహ్నం 12.30గంటలకు తీరాన్ని తాకింది. రెండున్నర లేదా మూడు గంటల్లో తీరం దాటుతుందని అధికారులు అంచనా వేసినట్టుగానే మధ్యాహ్నం సమయంలో తీరం దాటినట్టు ఆర్టీజీఎస్ నుంచి సమాచారం అందింది. ఇది మరింత బలహీనపడి వాయుగుండంగా మారి ఒడిశా వైపు పయనిస్తున్నట్టు గమనించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లాకు పెథాయ్ తుపాను ముప్పు తప్పింది. గాలుల తీవ్రత తగ్గుముఖం పట్టింది. కొన్ని చోట్ల వర్షాలు తెరిపినివ్వడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. మంత్రులు నారా లోకేశ్, కళా వెంకట్రావు, కిడారి శ్రవణ్ ఆర్టీజీఎస్ కేంద్రం నుంచే ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తుపాను గమనాన్ని పరిశీలిస్తే అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు కూలడం తదితర అంశాలను పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభించారు. తుపాను తీవ్రత తగ్గడంతో పలు చోట్ల గాలుల తీవ్రత తగ్గింది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

# ఏపీకి న్యాయం చేయాలి

కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసేవరకూ నిరాహార దీక్ష కొనసాగిస్తామని ఆయన తెలిపారు. మంగళవారం తన పుట్టిన రోజు సందర్భంగా ఎంపీ రామ్మోహన్‌నాయుడు గాంధీ విగ్రహం వద్ద దీక్షకు దిగారు.

నిరాహార దీక్ష విరమించిన తెదేపా ఎంపీలు

పార్లమెంట్ ఆవరణలో చేపట్టిన నిరాహార దీక్షను శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ మురళీ మోహన్ విరమించారు. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా రామ్మోహన్ నాయుడు తన పుట్టిన రోజున నిరాహార దీక్ష చేపట్టగా.. ఆయనకు మద్దతుగా మురళీ మోహన్ నిరాహార దీక్షలో కూర్చొన్నారు. విభజన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెదేపా ఎంపీలు మండిపడ్డారు. తాము చేపట్టిన ఈ దీక్షకు అనేక పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతు తెలిపారని చెప్పారు. నిజాయతీతో ప్రజల తరఫున చేస్తున్న తమ పోరాటానికి ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంపీలు సైతం సంఘీభావంగా నిలుస్తున్నారని, వారందరికీ ఏపీ ప్రజల తరఫున కృతజ్ఞతలు చెప్పారు.

తెదేపా ఎంపీలను కలిసిన వారణాసి విద్యార్థులు

మరోవైపు, పార్లమెంట్ ఆవరణలో నిసన తెలుపుతున్న తెదేపా ఎంపీలను వారణాసిలోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు కలిశారు. పార్లమెంట్ కార్యకలాపాలను వీక్షించేందుకు విజ్ఞాన యాత్రకు వచ్చిన ఆ విద్యార్థులు తెదేపా ఎంపీల నిరసనకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేదంటే ఇలాంటి పోరాటాలు జరుగుతాయని తెలుసుకున్నామని విద్యార్థులు మీడియాకు తెలిపారు.

# జీఎస్ఎల్వీ ఎఫ్-11 కౌంట్‌డౌన్ ప్రారంభం

ప్రారంభమైన కౌంట్ డౌన్ ప్రక్రియ 26 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది. బుధవారం సాయంత్రం 4.10 గంటలకు జీశాట్ - 7ఏ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లనుంది. జీశాట్-7ఏ ఉపగ్రహం బరువు 2,250 కిలోలు కాగా.. ఇది ఎనిమిదేళ్ల పాటు సేవలందించనుంది. ఇప్పటికే ఇస్రో ఛైర్మన్ శివన్ షార్‌కు చేరుకున్నారు.

# రాజ్యసభ బుధవారానికి వాయిదా

ప్రకటించగానే.. అన్నాడీఎంకే, డీఎంకే ఎంపీలు పోడియం వద్దకు దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. కావేరీ నదిపై డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఇదే సమయంలో ఏపీకి చెందిన ఎంపీలు సైతం ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రఫేల్ ఒప్పందంపై తాము ప్రవేశపెట్టిన సభా హక్కుల తీర్మానం అంగీకరించారని, రఫేల్ వ్యవహారంపై పోరాడేందుకు ఇది సరైన సమయమని సభ్యుల నినాదాల మధ్యే ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్ అన్నారు. రఫేల్ వ్యవహారంలో ప్రభుత్వం పార్లమెంటును, సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించిందని ఆజాద్ ఆరోపించడంతో.. అధికార పార్టీ ఎంపీలు నిరసనలకు దిగారు.

రఫేల్ సహా ప్రతిపక్షం లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి విజయ్‌గోయల్ ప్రకటించారు. కానీ సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చామన్న ఆరోపణలపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. మరోవైపు డీఎంకే, అన్నా డీఎంకే ఎంపీల ఆందోళన కొనసాగిస్తూనే ఉండడంతో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. మధ్యాహ్నం సభ పునఃప్రారంభమయ్యాక గజ, తిత్లీ తుపానుల వల్ల జరిగిన నష్టం.. తీసుకుంటున్న చర్యల గురించి వివరించాలని ఛైర్మన్ హోంమంత్రికి సూచించారు. ఈలోగా కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తి.. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ గోయల్ ఇంతకుముందు డిమాండ్ చేసిన దాని ప్రకారం రాహుల్‌గాంధీని క్షమాపణ కోరడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఎందుకంటే రాహుల్ మరో సభకు చెందిన వారని చెప్పారు. వెంటనే అధికార పార్టీకి చెందిన సభ్యులు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తూ నిరసనలు మొదలు పెట్టారు. ఇదే సమయంలో డీఎంకే, అన్నా డీఎంకే సభ్యులు కావేరీ జల వివాదంపై మళ్లీ పోడియంను చుట్టుముట్టి నిరసన తెలిపారు. రైతుల సమస్యలు ఒక్క తమిళనాడులోనే కాకుండా దేశమంతా ఉన్నాయని, ఈ అంశంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ చెల్లదని ఛైర్మన్ తేల్చి చెప్పారు. అయినా నిరసనలు ఆగకపోవడంతో సభ బుధవారానికి వాయిదా పడింది.

కొన్ని రాష్ట్రాల్లో తుపాన్లు మిగిల్చిన నష్టం, మరికొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ సంక్షోభం వంటి మరికొన్ని అంశాలను అత్యవసరంగా చర్చించాలని ఉదయం సభ ప్రారంభమైన వెంటనే ఛైర్మన్ వెంకయ్య నాయుడు సభ్యులకు సూచించారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి సంకీర్తన మహోత్సవం



విశాఖపట్నం : గోవిందరోడ్డు, వేంకటేశ్వర మెట్టపై వేంచేసియున్న శ్రీ రాంరాం మందిరం శ్రీ రామాలయంలో శ్రీ హరేరామ సంకీర్తన భక్తబృందం వారి ఆధ్వర్యంలో రాంరాం మందిరం వ్యవస్థాపక ధర్మకర్త సుధారా మయ్యమ్మ సారధ్యంలో శ్రీ ముక్కోటి ఏకాదశి సంకీర్తనా మహాయజ్ఞం శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి మంగళాశాసనములతో ఘనంగా నిర్వహిం చామని సంస్థ ఉపాధ్యక్షులు ఎం.వి.రాజ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రేమసమాజం గౌరవ కార్యదర్శి మట్టపల్లి హనుమంతురావు ప్రారంభించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా మందిరంలో వేంచేసి యున్న శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత ప్రతిష్ఠా మూర్తులకు, కళ్యాణమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముక్కోటి ఏకాదశి సంకీర్తనా మహా యజ్ఞం 24 గంటల పాటు నిర్విరామ సంకీర్తన నిర్వహించబడింది. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు నారాయణ సేవ అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

2000మందికిపైగా అన్న ప్రసాదాన్ని స్వీకరిం చారు.

అన్నప్రసదానికి దాతలుగా గూడెపు జగన్నాథం దంపతులు సుధారా మాయమ్మ, సుధాసీతాపతిరావులు వ్యవహరిం చారు.

కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, కార్యదర్శి ఎం.సీతాపతిరావు, రామ్ రామ్ మంది రం సేవకులు, స్థానికులు పరిసరప్రాంత వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మాస్టర్ ఎంఆర్ఎల్ రావుకు అంతిమ వీడ్కోలు



విశాఖపట్నం: నగరానికి చెందిన అంతర్జాతీయ ఆధ్యాత్మికవేత్త, మాస పత్రిక "మిహిర" పత్రిక సంపాదకులు, మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య శిష్యులు మల్లంపల్లి రాజా లక్ష్మణ రావు (73), (మాస్టర్ ఎం.ఆర్.ఎల్. రావు) గుండె పోటుతో తుది శ్వాస విడిచారు. శాంతినగర్‌లో నివాసం వుంటున్న ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయితే ఈ నెల 17 వ తేదీ సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆయన పార్థవదేహాన్ని మంగళవారం మధ్యాహ్నం జ్ఞానాపురంలో అంతిమ సంస్కరణలు చేశారు. మాస్టారుకు కుమారుడు మల్లంపల్లి ప్రద్యుమ్న, కోడలు ప్రభావతి, మనుమరాలు ప్రజ్ఞ వున్నారు. రాజా లక్ష్మణరావు యోగ జీవనం ప్రధానాంశంగా చేసుకున్నారు. దాదాపు 40 ఏళ్లు పాటు ఉచితంగా వేదం, జ్యోతిష్యము, హోమియో వైద్య సేవలు అందచేశారు. సనాతన భారతీయ విద్యల ద్వారా అనేక మందికి ప్రబోదనలతో వారిలో చైతన్యం తీసుకువచ్చారు. అనేక సామాజిక సేవలు ద్వారా విశాఖనగరంతో పాటు చుట్టు ప్రాంతాల ప్రజల మన్నలు పొందారు మాస్టార్ అకస్మిక మరణానికి అంతా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నగరానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులు ఆయన పార్థవదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఐవీఎల్ శాస్త్రి,పార్వతీకుమార్, కేవీఎస్ శాస్త్రి తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# యువత ప్రాణదాతలుగా నిలవాలి

## రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు



విశాఖపట్నం : విద్యార్థులు రక్తదానం చేస్తూ ప్రాణదాతలుగా నిలవాలని ఏయూ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం, విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం మంచి పరిణామమన్నారు.

వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.నిరంజన్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి రక్తదాతగా మారాలన్నారు. ముందుగా పోషకాహారం తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నిలవాలన్నారు. తద్వారా రక్తదానం చేస్తూ మరొకరికి ప్రాణదానం చేయడం సాధ్యపడుతుందన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం విద్యార్థుల్లో రక్తదానం పట్ల అవగాహన కల్పిస్తూ, రక్తదాతలుగా మార్చ డానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విద్యార్థినులు సైతం రక్తదాతలుగా మారాలన్నారు.

కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, ఎన్‌సిసి అధికారి డాక్టర్ ఎన్.ఎం యుగంధర్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సి.హెచ్ ఆశాఇమ్మినియల్ రాజు, ఆచార్య టి.శోభశ్రీ తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

## 26వ వార్డు వలందపేటలో

# తెలుగుదేశం పార్టీ సభ్యత్వం



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 26వ వార్డు వలందపేట లో తెలుగుదేశం పార్టీ ప్రతీష్టాత్మకముగా చేపడుతున్న సభ్యత్వాలు ప్రారంభమైనవి. మొదటి సభ్యత్వం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ కోనాడ సాదూరావు కి డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు అందజేసారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక పేదవారి సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారని, అందులో చంద్రన్న భీమా, చంద్రన్నపెళ్లికానుక, 50సంవత్సరాలు కె మత్స్యకారులకు పింఛన్లు, డప్పుకార్మికులకు, ఒంటరి మహిళలకు , గీత కార్మికులకు పింఛన్లతో పాటు వృద్దాప్య మరియు దివ్యాంగుల పింఛన్లు 5 రెట్లు పెంచడం జరిగిందని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఉందని చెప్పారు. తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం ముకు వంద రూపాయలు చెల్లించి క్రియాశీల సభ్యులుగా చేరాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో 26వ వార్డు జన్మభూమి కమిటీ సభ్యులు కోనాడ నారాయణరావు, కోనాడ కనకరాజు,, కోలా అప్పారావు, బోయి లక్ష్మయ్య మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, గిడుతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భీమిలిలో ఘనంగా

# వైకుంఠ ఏకాదశి



భీమునిపట్నం : మంగళవారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో భక్తులకు స్వామి ఉత్తర ద్వార దర్శనాన్ని శుక్రవారం తెల్లవారి రెండు గంటల నుండి మూడు ముప్పయి వరకు స్వామి వారికి పంచామృతాభిషేకం ప్రత్యక పూజలు ఏకీకృత ధర్మకర్త, ప్రధానార్చకులు రొంపిచర్ల.సింగరాచార్యులు నిర్వహించారు. అనంతరం భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించు కున్నారు . తెల్లవారి ఒంటి గంట నుండి భక్తులు అదిక సంఖ్యలో పాలుగున్నారు..సాయత్రం స్వామి వారికి అఖండ హారతి ని నిచ్చారు అలాగే కిటిన్ పేట లో వున్న శ్రీశ్రీశ్రీ ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం లో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీశ్రీశ్రీ ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారికి జరిగిన పూజాది కార్యక్రమాలలో పాల్గొని శ్రీవారి తీర్థ ,ప్రసాదములు ఆలయ అర్చకులు పురాణం శేషాచార్యులు అందజేసారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ ,చైర్మన్ కం మేనేజింగ్ ట్రస్టీ కలిగొట్ల బాబ్జీ, కలిగొట్ల శ్రీరామమూర్తి, ఉసిరికల తాతాజీ, సీహెచ్ వి మూర్తి, బి కృష్ణారావు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు, కృష్ణా కోలని కల్యాణ వెంకటేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకం ప్రత్యక పూజలు అనంతరం భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆభివృద్ధి కమిటీ అద్యక్షుడు గాడు అప్పలనాయుడు,,కమిటీ సభ్యులు జి.సన్యాసిరావు పెదబాబు, తదితరులు పాలుగున్నారు.



*మాధవధారలో మంగళవారం అయ్యప్ప స్వామి పీఠంలో గురుస్వామి బమ్మిడి. సంతోష్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో మహా శాంతిపూజ పూజ కార్యక్రమం ని రాపాక.వెంకట రామకృష్ణ శర్మ వేద మంత్రములతో నిర్వహించారు. పూజ అనంతరం స్వాములకు, వారి కుటుంబ సభ్యులు 300 మందికి పైగా కాయంకర్యం (టిఫిన్ ) కూడా నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాలు చెయ్యడం చాలా ఆనందమగా వుందని గురు స్వామి పేర్కొన్నారు ఇటువంటి కార్యక్రమాలు ఈ కార్తీకంలో 3 కార్యక్రమాలు చేశామని ఆ అయ్యప్ప స్వామి అశీసులతో సుమారు 1500 కు పైగా అన్నదానం చెయ్యడం చాల ఆనందముగా వుందని తెలిపారు.*

## జగనన్న జన్మదినోత్సవం వేడుకలకు అందరూ హాజరవ్వాలి

భీమునిపట్నం : ఈ నెల 21. వ తేదీ శుక్రవారం జగనన్న జన్మదినోత్సవం సందర్భం గా భీమిలి నియోజకవర్గం వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అఫీస్ లో. రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నా మని కాబట్టి నియోజకవర్గం లో నున్న విశాఖ జిల్లా, మండలాలు,వార్డుల నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా యువజన విభాగం, స్టూడెంట్స్ విభాగం,మరియు మహిళ సంఘాలు, అనుబంధ సంఘాలు అభిమానులు అందరూ పాల్గొనాలని నియోజవర్గ కన్వీనర్ విజయనిర్మల కోరారు.

ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిలు గా విశాఖ పార్లమెంటు అధ్యక్షులు తైనాల విజయకుమార్,, విశాఖ పార్లమెంటు అధ్యక్షులు ఎ.జ.జ. సత్యనారాయణ , విశాఖ నగర అధ్యక్షులు. మల్ల విజయ ప్రసాద్,, విచ్చేస్తున్నారని .కాబట్టి ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఆమె తెలిపారు.

# క్రిస్మస్ సందర్భంగా ప్రేమ విందు

భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గం కొమ్మాది గ్రామం కె2 కాలనీ లో మంగళవారం మధ్యాహ్నం క్రిస్మస్ సందర్భంగా ప్రార్థన మందిరంలో పోతన నానాజీ గారి ఆధ్వర్యంలో ప్రేమ విందు ఏర్పాటు చేశారు.ఇందులో సుమారు ఐదు వందల మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కొమ్మాది యూత్ ప్రెసిడెంట గుంటుబోయిన సంజీవ్ యాదవ్. కె2 కాలనీ ప్రెసిడెంట్ పద్మావతి ,గురుమూర్తి రవి విక్రమ్ కుమార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ద్రోణంరాజు జయంతిని విజయవంతం చేయాలి

## నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బెహరా భాస్కరావు



విశాఖపట్నం : ద్రోణంరాజు జయంతిని విజయవంతం చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరావు పిలుపునిచ్చారు. ఈ నెల 19న ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి సందర్భంగా మంగళవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరారావు అధ్యక్షతన బుధవారం జరగబోయే ద్రోణంరాజు జయంతి కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి, కేరళా మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాంది, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, టి సుబ్బరామిరెడ్డి, మాజీ కేంద్ర మంత్రులు కిల్లి కృపారాణి, పల్లం రాజు, పనబాక లక్ష్మి, జేడీ సీలం, రాష్ట్ర కాంగ్రెస్ నాయకు కనుమూరి బాపిరాజు, మూడు జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు విచ్చేస్తున్నారు. కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బెహరా భాస్కరావు మాట్లాడుతూ ద్రోణంరాజు జయంతిని పురస్కరించుకుని ఉదయం 9.30 సిరిపురం ద్రోణంరాజు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి నివాళుఅర్పించడం జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు గురజాడ కళాక్షేత్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరుగుతుంది. ఈ రెండు కార్యక్రమాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విచ్చేసి జయప్రదం చేయవలసినదిగా కోరారు. అనంతరం ఉత్తరాంధ్ర కాంగ్రెస్ కార్యకర్తల సదస్సు ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, లీగల్‌సెల్ చైర్మన్ వజ్జిపర్తి శ్రీనివాస్, వుడా మాజీ చైర్మన్ పీఎస్ఎన్ రాజు, సేవాదళ్ చైర్మన్ పెంటపల్లి సత్యనారాయణ, గాజువాక ఇన్‌ఛార్జి మంత్రి రాజశేఖర్, తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి గుత్తుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తోట దుర్గారావు, డీసీసీ మాజీ అధ్యక్షులు పి సతీష్‌శర్మ, ఎం సత్యనారాయణరాజు, మల్ల ఈశ్వరరావు, కట్టుముచ్చు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న రాకతో మీ సమస్యకు శాశ్వత పరిష్కారం

**స్మార్ట్ సిటీ అని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడమే గాని సమస్యకు పరిష్కారం చూపదు**

**తుపాను ప్రాంతంలో నష్టపోయిన మత్స్యకారులను పరామర్శించిన వంశీకృష్ణ శ్రీనివాస్**



విశాఖపట్నం: మంగళవారం 17వ వార్డు పరిధిలో గల పెద జాలరిపేటలో వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాస్ వంశీకృష్ణ పర్యటించారు. స్థానిక మత్స్యకార కుటుంబాలను కలసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో విపరీతంగా పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన రావడం , తద్వారా రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత 2 పర్యాయాలు గెలిచిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై ఎప్పుడు పట్టించుకోరని వర్షాలు పడినప్పుడు ప్రతిసారి ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

శాశ్వత పరిష్కారం చూపకుండా ఎదో నామమాత్రంగా చెత్త తీస్తున్నారని తెలిపారు. స్మార్టు సిటీ అని ప్రభుత్వం గొప్పలు చెప్పుకొని నిధులను దుర్వినియోగం చేస్తున్నారని త్వరలో వైసీపీ ప్రభుత్వం వస్తుందని శాశ్వత పరిష్కారం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సహాయక చర్యలులో విఫలమైందని మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు..

## రైతులను ముంచిన పెథాయ్

కొయ్యూరు : ఫెథాయ్ రైతులను నిలువునా ముంచింది. ఎకరాకు రూ.15వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం ఆ డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదు. కోసిన పనలు వర్షాలకు తడిసిపోవడంతో ధాన్యం రంగుమారిపోనుంది. దీనిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎవరూ ముందుకు రాని పరిస్థితి నెలకొంటుంది. మండల కేంద్రంలో 120 గ్రామాల్లో అంధకారం నెలకొంది. విద్యుత్ లేకపోవడంతో రక్షిత పథకాల నుంచి సరఫరా జరగక తాగునీటికి ఎద్దడి ఏర్పడింది. రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.


**ఉత్తర రైల్వే**

**సవరణ**

**ఫైలు నెం. సిఐఐడి/పార్శిల్ ఔట్‌సోర్సింగ్/ఎఎన్‌విటి/2017**

**రిఫరెన్సు: 22/11/2018న ప్రచురిత ఎన్ఐటి, టెండరు తెరుచు తేది: 26.12.2018**

సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు/ఫ్రైట్, ఢిల్లీ డివిజన్, ఉత్తర రైల్వే, న్యూఢిల్లీ వారు సీలు చేసిన బహిరంగ టెండర్లు ఆనంద్ విహార్ టర్మినల్ నుంచి ప్రారంభమగు వివిధ రైళ్ళలో ఎస్ఎల్ఆర్ స్పేస్‌ను మొత్తంగా లీజుకు తీసుకునే మూడు సంవత్సరములు కాంట్రాక్టునకు సంబంధించి టెండరు డాక్యుమెంటు యొక్క పేజి 07 యొక్క పారా నెం.3 (టెండరుదార్లకు సూచనలు) టెండరు విలువ: రూ. 11,800/-ను టెండరు విలువ: రూ. 29,500/-గా చదువుకోగలరు. ఎన్ఐటి యొక్క ఇతర వివరాలు యధాతథం.

**3146/18**

**వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు**

# విజయభాను

## సంపాదకీయం

### నిర్బంధం లేకపోవడం పెద్దలోపం

వాతావరణ మార్పులను అరికట్టి మానవాళి మనుగడను కాపాడే దిశగా పోలాండ్‌లోని కటోవైస్‌లో సమావేశమైన 195 దేశాల ప్రతినిధులు 2015 నాటి ప్యారిస్ ఒడంబడిక అమలుపై ఒక నియమావళి (ప్యారిస్ - రూల్‌బుక్)ని రూపొందించు కోగలిగారు. ఈ నియమావళిపై ఏకాభిప్రాయం కుదరడం వల్ల ప్యారిస్ ఒడంబడికపై స్తబ్దత ఏర్పడకుండా కాపాడుకున్నామనే సంతృప్తి వ్యక్తమవుతున్న పుటికీ, అభివృద్ధి చెందిన దేశాల నుంచి ఆశించిన రీతిలో హామీలు రాకపోవడం ఆందోళనకరం. ప్యారిస్ ఒడంబడిక కుదిరినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా హర్షం వ్యక్తమైంది. కానీ ఆ ప్యారిస్ ఒడంబడిక కూడా ఒక రాజీ సూత్రమే. పారిశ్రామిక విప్లవం వచ్చిన తరువాత పర్యావరణానికి కలిగిన నష్టానికి అంతటికి బాధ్యత పారిశ్రామిక దేశాలదే. పారిశ్రామికదేశాలు తమ బాధ్యతను గుర్తించి వాతావరణ మార్పును అరికట్టడంలో క్రియాశీల పాత్రను పోషించాలని భారత్ వంటి వర్ధమాన దేశాలు కోరుతున్నాయి. ఇప్పుడు పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన సాంకేతిక పరిజ్ఞానం అమెరికా, యూరప్ దేశాల దగ్గరనే ఉన్నది. దానిని ప్రవేశ పెట్టవలసినంత నిధులు కూడా వాటి దగ్గరే ఉన్నాయి. అందువల్ల వర్ధమాన దేశాలలో హరిత పరిజ్ఞానాన్ని అమలు చేయాలంటే, ఈ అభివృద్ధి చెందిన దేశాలు ఉదారంగా తోడ్పడాలె. సాంతికేత పరిజ్ఞానాన్ని, నిధులను వర్ధమాన దేశాలకు అందించాలె. కానీ ఈ దిశగా ముందడుగు పడటం లేదు. ఇటీవల పోలాండ్‌లోని కటోవైస్‌లో జరిగిన సమావేశంలో కూడా వర్ధమాన దేశాలు అభివృద్ధి చెందిన రాజ్యాల నుంచి ఎటువంటి నిర్దిష్ట హామీలు పొందలేక పోవడమే విషాదం. పోలాండ్‌లో అమోదం పొందిన ప్యారిస్ నియమావళి నిండా అనేక లోపాలున్నాయని పర్యావరణ ఉద్యమకారులు, వర్ధమాన దేశాల ప్రతినిధులు అంటున్నారు. కర్బన ఉద్గారాలు ఏ మేర వెలువడు తున్నాయి, వాటిని అరికట్టేందుకు ఏయే చర్యలు తీసుకున్నారు, పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయడంలో ఏమేర నిధులు వెచ్చించారు మొదలైన అంశాలలో ఆయా దేశాలు కచ్చితంగా పారదర్శకత పాటించాలనే అంగీకారం కటోవైస్ సమావేశంలో కుదిరింది. కానీ ప్రపంచ దేశాలపై ఈ నియమాల అమలుకు ఎటువంటి నిర్బంధం లేదు. జవాబుదారీతనం లేకుండా, స్వచ్ఛందం గా అమలు చేయాలంటే సాధ్యమవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్యారిస్ ఒడంబడిక నుంచి ఇప్పటికే అమెరికా వైదొలిగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాదిరిగానే యూరప్ దేశాలలోని కొందరు నాయకులు వాతావరణ మార్పుఅనే వాదనే పెద్ద అబద్ధమని అభిప్రాయపడే వారున్నారు. చైనా, భారత్‌లతో పోలిస్తే, తలసరి లెక్కన ఉద్గారాల మోతా దు యూరప్ దేశాలలోనే ఎక్కువగా ఉన్నది. కానీ తలసరి లెక్కన కాకుండా దేశం మొత్తాన్ని ప్రాతిపదికగా తీసుకొని భారత్, చైనాలను కట్టడి చేయాలనే ప్రయత్నం సాగుతున్నది. కానీ ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న దేశాలపై నియంత్రణ పెడితే ఎప్పటికీ పాశ్చాత్య దేశాల ఆధిపత్యమే కొనసాగుతుంది. శిలాజ ఇంధన లాబీలు కూడా ప్యారిస్ ఒడంబడికను వ్యతిరేకిస్తున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత దశలో, ఇటీవలి కాలంలో ప్రాంతీయ శక్తులు అవతరించి ఆర్థిక, భౌగోళిక ఆధిపత్యం కోసం పెనుగులాడు తున్నాయి. ఈ దశలో కటోవైస్ సమావేశంలో కనీసం రూల్‌బుక్ ఆమోదం పొందడం కూడా ఒక విజయమేననే వాదన కూడా వినిపిస్తున్నది. ఒకప్పుడు భూగోళ వేడిమి పెరుగుదలను 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ దగ్గర నిలువరించాలనే అభిప్రాయం ఉండేది. కానీ అది కూడా ఎక్కువేనని, భూగోళాన్ని కాపాడుకోవాలంటే, మరింత కఠిన చర్యలు అవసరమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు విడుదల చేసిన ఒక నివేదిక (ఐపీసీసీ) ప్రకారం-1.5 డిగ్రీల పెరుగుదల మూలంగా అనేక ప్రకృతి బీభత్సాలు చోటు చేసుకోవడమే కాకుండా, ఆహార కొరత తరచు తలెత్తుతుంది. వాతావరణ మార్పులపై అధ్యయన ప్యానెల్ (ఐపీసీసీ) చేసిన హెచ్చరిక ప్రకారం- 1.5 డిగ్రీల దగ్గర వేడిమిని నియంత్రించడానికి ఇంకా పన్నెండేండ్ల వ్యవధి మాత్రమే ఉన్నది. ఈ లక్ష్యాన్ని అందుకోవాలంటే 2030 నాటికి కర్బన ఉద్గారాలు 45 శాతం తగ్గించుకోవలసి ఉంటుంది. ఆయా దేశాలలోని పోకడ గమనిస్తే కానీ ఇప్పటివరకు ఈ ఉద్గారాలు పెరుగుతూనే ఉన్నాయి, తప్ప తగ్గడం లేదు. ప్రపంచ వ్యాప్తంగా అన్నిదేశాలు 1.5 డిగ్రీల దగ్గర వేడిమి పెరుగుదలను నియంత్రించే లక్ష్యానికి కట్టుబడాలె. అయితే ఆయా దేశాల అంగీకారం తీసుకోవడమే తప్ప,అమలు చేసే నిర్బంధం లేకపోవడం పెద్దలోపం. వాతావరణ మార్పుల వల్ల ప్రకృతి వైపరీత్యాల తీవ్రత పెరుగుతున్న దనేది ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అనుభవానికి వచ్చింది.

# ఉత్తరద్వార దర్శనం.. భక్తుల పారవశ్యం



విజయనగరం : వైకుంఠ ఏకాదశి ,గీతా జయంతి సందర్భంగా మంగళవారం వివిధ వైష్ణవి ఆలయాల్లో భక్తుల గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. ముక్కోటి ఏకాధవిరోజు ఉత్తరద్వారం ద్వారా శ్రీమన్నారాయణుని దర్శించుకుంటే పుణ్యకమని భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రింగ్‌రోడ్ శ్రీకళ్యాణవెంకటేశ్వరుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యే పల్లకిపై అలంకరణలతో...స్వామి వారిని వైభోపేతంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు జరిగాయి. రద్దీలో భక్తులు క్యూ లైన్ ద్వారా స్వామి వారిని దర్శించుకుని కొబ్బరికాయలు, పండ్లు, పూలు, కానుకలు సమర్పించుకున్నారు. తెల్లవారుఝాము 4 గంటలనుండి శ్రీస్వామివారి దర్శనానికి ఉత్తర ద్వారం తెరవగా అప్పటికే భక్తులు వేచివున్నారు. ఆలయ అర్చకులు పీసపాటి సంపత్‌కుమారాచార్యులు, శ్రీమన్నారాయణాచార్యులు ప్రత్యేకపైజలు చేశారు. శ్రీనివాస సేవాసంఘం అధ్యక్షులు పిళ్ళా విజయకుమార్, కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, బి.హెచ్.స్యూలక్ష్మి, రమణ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో దీపారాధన చేశారు.

# రంగురాళ్ల క్వారీల్లో తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవు

## నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ



సాలికమల్లవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ రేవతమ్మ

గొలుగొండ : సాలికమల్లవరం రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ హెచ్చరించారు. మంగళవారం సాలిక మల్లవరం వద్ద అటవీ భూమిలో తవ్వకాలు జరిగిన రంగురాళ్ల క్వారీ ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం సాలికమల్లవరం గ్రామస్థులతో సమావేశ మయ్యారు. ఎవరైనా వారి ప్రాంతంలో తవ్వకాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. తవ్వకాలకు సంబంధించి ఏ విధమైన సమాచారాన్ని అయినా పోలీసులకు తెలియజేయాలని ఆమె కోరారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎంతటి స్థాయి వ్యక్తులు చేసినా వారిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై ఉమా మహేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్ద పెద్ది రెడ్ల మల్లేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

## మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్



విజయనగరం : తుఫాన్ కారణంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగు దలకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలో తుఫాన్ కారణంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. వెంటనే నీటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని శానిటేషన్ ఇన్ స్పెక్టర్లకు, పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. అవసరమైనచోట మోటార్లు ఏర్పాటుచేసి నీటిని తొలగించాలని సూచించారు. తాత్కాలికంగా కాలువలు ఏర్పాటుచేసి ప్రధాన కాలువకు అనుసందానం చేయాలని సూచించారు. మురుగునీరు నిల్వలేకుండా తగు చర్యలు తీసుకుంటూ, దోమల నివారణ కోసం క్రిమిసంహారక పిచికారీ చేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై స్థానిక ప్రజలు అవగాహన పెంచుకుని సహకరించాలని కోరారు. తుఫాన్ సందర్భంగా వర్షంలో కూడా విధులు నిర్వహించిన పారిశుద్ధ్య సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

# చైన్ స్నాచింగు దొంగ అరెస్టు

## సిసిఎస్ డిఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి



విజయనగరం: పట్టణంలో ఉడా కాలనీ మరియు గరుగుబిల్లి మండలంలో మహిళ మెడల్లో పుస్తుల త్రాళ్ళు దొంగిలించుకొని పోయిన బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన చైన్ స్నాచర్ మైలపల్లి గణేష్(26 సం॥లు), సిసిఎస్, విజయనగరం 1వ పట్టణ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లుగా విజయనగరం సిసిఎస్ డిఎస్పీ ఎ.ఎస్. చక్రవర్తి మంగళవారం తెలిపారు. సిసిఎస్ పోలీసులకు రాబడిన సమాచారంపై విజయ నగరం పట్టణం ఆర్టీఒ కార్యాలయం సమీపంలో అనుమానస్పదంగా తిరుగుతున్న మైలపల్లి గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల విచారణలో మైలపల్లి గణేష్ విజయ నగరం పట్టణంలోను, గరుగు బిల్లి మండలంలో పుస్తుల తాడును మహిళ మెడల్లో నుండి తెంచుకొని పోయినట్లుగా అంగీక రించాడు. సుమారు రూ॥ 1.20 లక్షలు విలువైన రెండు బంగారు పుస్తుల తాడులను స్వాధీన పర్చుకున్నట్లుగా డిఎస్పీ ఎ.ఎస్. చక్రవర్తి తెలిపారు. ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేయుటలోను, చోరీ సొత్తును స్వాధీనపర్చు కోవడంలోను సిసిఎస్ సిఐ ఎం. కృష్ణమూర్తి, ఎస్ఐలు ఐ.రాజారావు, నాయుడు, ఎస్.ఫకృద్ధీన్, హెచ్‌సి ఎన్. సత్య న్నారాయణ, ఎం. భానూజీరావు, బి. ముత్యాలనాయుడు బి. కాశి రాజులు ప్రతిభ కనబర్చారని డిఎస్పీ ఎ.ఎస్. చక్రవర్తి అభినందించారు.

### గ్రామాల్లో తాగునీటికి ముందస్తు చర్యలు

యలమంచిలి రూరల్ : మండలంలోని గల అన్ని గ్రామాల్లో ప్రజలకు తుపాన్ ప్రభావం వల్ల తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గాను ఆయా గ్రామాలకు చెందిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తుపాన్ ధాటికి అన్ని గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయే అవకాశం ఉన్నప్పటికీ గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని...

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు అప్రమత్తమై తాగునీరు అందించారు.

## సమయం

### చదువు - శ్రమ జీవనం

చదవండో... చదవండో...
విద్యలు తల్లిని కొలవండో...
దస్తరాలు బరువులు గాదు?
సంస్కారవంతులు కావాలి...
చదువులతో సరిపరిపాలన జరపాలి...
కాయకష్టం మనందరిది
శ్రమలను చేబట్టి;
సమాజమంతా శ్రమనే మోయాలి.
కావించాలో శ్రమ జీవనం
కరువంటు లేకుండ చేయాలో...
జరుగుబాటు గల దనిపించాలో...
నదుల, నదములు పారుతు వున్నాయ్
పొలాలు, హలములు, ఎన్నెన్నో వున్నాయ్
ఇన్నీ... వున్నా...?
ఎత్తుకు పెరుగుతు ధరలెందుకు వున్నాయ్?
అర్ధాకలితో పొట్టలు మాడుట చింతనతో...?
ఎందరకు సరిగ తిండుంది?
నీరస మానవ జీవనమా?
కొండలు, పెండెలు తెంచేపనితనముంది
దండలు బలముతో బండలు యెత్తే శ్రమ వుంది
ఓ... ఆకలి మానవ పయనమా?
ఏది కొందుమా...
ధరలతో బితుకు;
బలం తక్కువ తిండితో మనకు
జబ్బులు మోయుట యెక్కువని
రాజ్యపాలన నీరసమని...

... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 8096960483

# ఘనంగా మురళి జన్మదిన వేడుకలు



అనకాపల్లి : కొణతాల మురళి కృష్ణ పుట్టిన రోజు వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా పట్టణంలో న్యూకాలని గల శ్రేయ ఫౌండేషన్‌లో పిల్లలకు స్వీట్లు పండ్లు పంపిణి చేస్తూ, వారి చేతుల మీదగా కేక్ కట్టింగ్ చేయించడం జరిగింది ,అలానే వెంకుపాలెంలో గల వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు పెట్టీ ,స్వీట్స్ ,పండ్లు తో పాటుగా కేక్ కట్టింగ్ చెయ్యటం జరిగింది , కొణతాల మురళీ క్రిష్ణ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపు కోవాలని చెప్పటం జరిగింది ,ఈ కార్యక్రమంలో కొణతాల శ్యామ్ , జాజుల రమేష్,బీశెట్టి జగన్, గైపురి రాజు, సాదీపుడి గణేష్,బుద్ధ తరుణ్,రూప్ తేజ , గంట సముద్రాలు, జోగుల రాజు, ఇల్లపు ప్రతాప్ సాయి , తదితరులు పాల్గొనడం జరిగింది.

# పవిత్ర ముక్కోటి ఏకాదశి వేడుకల్లో ....

## ఆపదహరుని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజు ...

చోడవరం : పవిత్ర ముక్కోటి ఏకాదశి వేడుకల్లో భాగంగా మంగళ వారం స్థానిక ఆపదహర శ్రీ శ్రీనివాస క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు పాల్గొని, ఉత్తర ద్వారం గుండా స్వామి వార్ని దర్శనం చేసుకున్నారు. స్వామి వారి పల్లకీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ రాజకీయాల కతీతంగా నియోజకవర్గ ప్రజలందరి సంక్షేమాన్ని కోరి పద్మావతి, అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకున్నట్లు తెలియజేసారు. ఏడాదికి ఒకసారి వచ్చెడి ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున నారాయణుడ్ని దర్శనం చేసుకుంటే కోటి జన్మల ఫలితం వస్తుందనే పెద్దల మనోభిప్రాయాలను తప్పకుండా గౌరవించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఒ. సత్యనారాయణ మూర్తి ఎమ్మె ల్యేకు దుశ్శాలువా కప్పి, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసారు. ఎమ్మెల్యే వెంట ఎం.పి.పి గూనూరు కొండతల్లి వెంకట సత్యనారాయణ, ఎం.పి.టి.సి. మారేడుపూడి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 22 నుంచి పోరు బాటలో వైయస్సార్ : పార్టీ నేత మజ్జిశ్రీను

విజయనగరం: గత నాలుగు రోజులుగా పెథాయి తుఫాను జిల్లాలో ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తూంటే ప్రజలను అప్రమత్తం చేసి ఆదుకోవలసిన భాద్యత కలిగిన మంత్రి సుజయకృష్ణరంగారావుగాని, మాజీమంత్రి పార్లమెంటుసభ్యులు అశోక్ గజపతిరాజులు ఎక్కడున్నారని జిల్లా వైయస్సార్.కాంగ్రెస్ పార్టీ రాజకీయవ్యవహారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను) ప్రశ్నించారు.ప్రసార మాద్యమాల పుణ్యమాని తుఫాను పట్ల ప్రజలు అప్రత్తమైనందున జిల్లాలో ప్రాణనష్టం సంభవించలేదని ఆయన మీడియాను అభినందించారు. మంగళవారం స్థానిక సత్యాకార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశములో ఆయన మాట్లాడారు.తుఫాను మూలంగా రైతులు ఎంతో నష్టపోయారని పండించిన వరి పంట పొలాల్లోనే ఉండి పోయి తడిసి ముద్దయి పోయినందున రైతులుకు పండిన ఆ కొద్ది పంట కూడా చేతికందని పరిస్థితి కలిగిందన్నారు.ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసి ఉంటే రైతుకు ఈ నష్టం జరిగేది కాదని శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు.జిల్లాలో 26 మండలాలలో కరవు నెలకొందని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపితే ప్రభుత్వం కేవలం 8మండలాలు మాత్రమే కరవు మండలాలుగా గుర్తించడం అన్యాయమన్నారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కరవు పరిస్థితులుపై మంత్రి సుజయ్, ఎంపి అశోక్ గజపతిరాజుతో పాటు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం చూస్తుంటే వారి దృష్టిలో రైతులు కొరగాని వారిలా కనిపిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రజలకిచ్చిన వాగ్దానాలు ఎలాగు అమలు చేయలేదు సరికదా పేదల కందించవలసిన ఎన్టీఆర్ వైద్య సేవాపథకం కూడా నిర్వీర్యం చేస్తున్నారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం అమలు చేసిన నెట్‌వర్కు ఆసుపత్రులకు నాలుగు వందల కోట్లు బకాయిలు చెల్లించనందున ఎన్టీఆర్ వైద్యసేవలు మూసివేస్తున్నట్లు ఆయా ఆసుపత్రులు నిర్ణయించుకున్నందున పేదవానికి ఆ అవకాశం కూడా కోల్పోయిన దుస్థితి దాపురించి ందన్నారు.దివంగత ముఖ్యమంత్రి డా॥ రాజశేఖరరెడ్డి గొప్ప ఆశయంతో అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకంను ఈ ప్రభుత్వం అటకెక్కించే ఆలోచనలో ఉందన్నారు.సామాన్యులుకి పాము కరిచినా, గుండె జబ్బు వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తే అచ్చట వైద్య సౌకర్యం అందని పరిస్థితి నెలకొందని శ్రీనివాసరావు ఆరోపించారు.అగ్రిగోల్డు యాజమాన్యం చేసిన మోసానికి లక్షలాది మంది బాధితులు రోడ్డునపడి మానసిక ఒత్తిడితో మరణిస్తుంటే గతనాలుగేళ్లుగా రాష్ట్రప్రభుత్వం చర్చలు, సమావేశాలతో కాలయాపన చేయడం దురదృష్టకరమన్నారు. బాధితులకు 12వందల కోట్లు రూపాయలు ముందుగా చెల్లిస్తే ఎనబైశాతం సమస్య పరిష్కారమవుతుందని ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాన్ని కోరితే దీనిని కూడా ముఖ్యమంత్రి పట్టించుకోలేదని ఆయన పేర్కొన్నారు. భాద్యత కలిగిన ప్రతిపక్షంగా బాధితులకు బాసటగా నిలిచి పోరాటానికి సిద్ధమయ్యిందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 22,23 తేదీలలో మండల కేంద్రాలలో వైసిపి అద్వర్యంలో రిలేనిరాహార దీక్షలు చేపడతా మన్నారు. రానున్న ఎన్నికలలో విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అగ్రిగోల్డు బాధితులకు చెల్లించవలసిన సొమ్ము చెల్లింపుకు చర్యలు చేపడతారని శ్రీనివాసరావు బాధితులకు భరోసా ఇచ్చారు.ఆదరణ పథకం అంటూ రెండు కత్తెరలు, నాలుగు ఇస్త్రీపెట్టెలు ఇస్తే సరిపో దన్నారు.బి.సి.లకు రిజర్వేషన్లు అమలు చేస్తామని, ప్రత్యేక నియోజక వర్గాలు, కార్పోరేషన్లు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు నాయుడు బి.సి.లకు హామీలు ఇచ్చి వాటిని అమలు చేశారా ? అని శ్రీనివాసరావు నిలదీశారు. బి.సి.లను మోసగించినందుకు మీకు ఎన్నికలలో వారు తగిన బుద్ది చెపుతారని ఆయన హెచ్చరించారు.వైయస్సార్.కాంగ్రెస్ పార్టీ బి.సి.లకు అండగా నిలిచి వారికి జరిగిన అన్యాయంపై ఈనెల 20న అన్ని జిల్లాలలో నిరశన ర్యాలీలు నిర్వహించి కలక్టరుకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు.మొదట నుండి రెండు నాలుకల ధోరణితో ద్వంద వైఖరి ప్రదర్శిస్తుంటారని అంటూ నాడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం లేదు. ప్యాకేజీచాలు అని నేడు హోదాకోసం తాను మాత్రమే పోరాడుతున్నట్టు చెప్పుకోవడం సిగ్గు



చేటన్నారు.తెలంగాణా రాష్ట్రసమితితో వైసిపి కలసి నడుస్తుందని చెబుతున్న చంద్రబాబునాయుడు తెలంగాణా ఎన్నికలకు ముందు టి.ఆర్.ఎస్‌తో జతకట్టే ప్రయత్నం చేసి విఫలమై ఆ తరువాత మహాకూటమి అవతార మెత్తిన విషయాన్ని శ్రీనివాసరావు గుర్తు చేశారు.ప్రధాని మోడి పెద్దనోట్లు రద్దు చేసినపుడు తానే సలహా ఇచ్చానని చెప్పుకున్న చంద్రబాబునాయుడు ప్రజలనుండి వ్యక్తమైన వ్యతిరేకతతో మాట మార్చి పెద్దనోట్లు రద్దును విమర్శిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.జిల్లాలో కరువు పరిస్థితులను నివారించి రైతులను , రైతుకూళీలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వెంటనే చర్యలు చేసట్టాలని, తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తుఫాను వలన తడిచిన ధాన్యం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేసారు.సమావేశంలో డిసిఎమ్ఎస్. అధ్యక్షులు శిరువూరి వెంకట రమణ రాజు, డిసిసిబి ఉపాద్యక్షులు చనమల్ల వెంకటరమణ, పార్టీ జిల్లా నాయకులు పిళ్లా విజయకుమార్, ఎమ్.ఎల్. ఎన్.రాజులు పాల్గొన్నారు.

# కుష్టువ్యాధి గ్రస్థులకు చేయూత



కాకినాడ/రాజమహేంద్రవరం: లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కడియం ఇమ్మానియేల్ లేప్రసి కాలనీలో గల కుష్టి వ్యాధి గ్రస్తులకు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఉందుర్తి జాన్ కుమార్ కావ్య దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28 మంది స్త్రీలకు, 22 మంది పురుషులకు వస్త్రాలు పంపిణీ చేశామన్నారు. లవ్ ఇన్ యాక్షన్ మినిస్ట్రీస్ ద్వారా పేదప్రజలకు సేవా చేయడమే తమ తపన అన్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా నిత్యవసర వస్తువుల పంపిణీ, మహిళలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు కుట్టు మిషన్లు పంపిణి, స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు బ్యాగ్ లు మరియు సైకిల్స్, వృద్ధుల కు దుప్పట్లు, అందజేస్తున్నామని, ఈ సంస్థ ద్వారా భవిష్యత్తులో ఇంకా ఎక్కువగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా ఉన్నంతలో ఎదుటి వారికి సహాయ పడాలని కోరారు.ఈ కార్యక్రమంలో పి.వెంకటరాజు, డి.గాంధీ, ఎన్. జోజిబాబు,గోపి తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తరాంధ్ర కార్యకర్తల సమావేశానికి

## అరకు కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు



అరకులోయ: కీర్తిశేషులు ద్రోణంరాజు సత్యనారయణ 86 జయంతి సంధర్భంగా ఉత్తరాంధ్ర జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం విశాఖపట్నం గురజాడ కళాక్షేత్రంలో నేడు నిర్వ హిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అరకులోయ నియోజక వర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పాచిపెంట.శాంతకుమారి అరకులోయ పత్రిక వారికి తెలిపారు. ఈ సమావేశంలో కేరళ మాజి ముఖ్యమంత్రి ఉమెన్ చాంది, ఉమ్మడి ఆంధ్రపదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి.కిరణ్ కుమార్ రెడ్డి, పి.సి.సి అధ్యక్షులు ఎన్.రఘు వీరారెడ్డి, రాజ్య సభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి, కె.వి.పి రామ చంద్రరావు, మాజి కేంద్ర మంత్రులు కిషోర్ చంద్రదేవ్, పల్లం రాజు, కిల్లీ.క్రుపరాణీ, ఏఐసిసి కార్యదర్శి క్రిష్టపర తిలక్‌లు పాల్గొంటునట్లు తెలిపారు. అలగే అరకులోయ నుండి తనునీ కాంగ్రెసు పార్టీలో గుర్తించి నందుకు పార్టీ పెద్దవాళ్ళకు ధాన్య వాదాలు తెలుపుతూ నేడు గురజాడ కళాక్షేత్రం లో కాంగ్రేస్ కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చెయ్యాలని అన్నారు.

## వైఎస్ఆర్‌సిపీకి పట్టం కట్టాలని ప్రచారం

తాళ్లరేవు: ఎరానున్న శాసనసభ ఎన్నికలలో వైఎస్ఆర్‌సిపికి ప్రజలు పట్టం కట్టాలంటూ మండలంలోని పలు గ్రామాలలో వైఎస్ఆర్‌సిపి నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ముమ్మడివరం, వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ మాజీ ఎమ్మెల్మే పొన్నాడి వెంకట సతీష్‌కుమార్ పర్యవేక్షణలో ఇంటింట ప్రచారం నిర్వహిం చారు. వైఎస్ఆర్‌సిపికీ పట్టం కడితే నవరత్నా పథకాలను ప్రజలకు అందేలా చర్యలు చేపడతా మని తద్వారా ఎంతో మెలు జరగుతుందన్నిరు. టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉన్న పథకాలను ఎత్తివేయడం ఉద్యోగాలను భర్తీచేయకుండా నిరుద్యోగులను మోసంచేయడం వంటి ఘటనలకు పలుపడు తున్నారని వారికి ఓటు ద్వారా తగిన గుణపాఠం నేర్పాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈ కార్య క్రమంలో వైఎస్ఆర్‌సిసి సీనీయిర్ నాయకులు డి. జనర్ధానరావు, మండలాధ్యక్షుడు కె. గోవింద కుమార్, ఆర్. మల్లేశ్వరరావు, టి. నాగేశ్వరరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శివారు గ్రామాలల్లో కనీస వసతులు కల్పించాలి

కాజులూరు: గ్రామ శివారుచీకట్లవారి పేట, ఉడావారి పేటనలలో కనీస వసతులు కల్పించాలనీ, స్థానికులు, కోరుతున్నారు. స్థానిక వైఎస్సార్ సిపి నాయకుడు టేకుమూడి దుర్గారావు, మాజీ సర్పంచ్ పోతురాజు బాబూరావు, తదితరులు మంగళవారం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ రెండు కాలనీలలో సరైన రోడ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలో కనీసం కచ్చా డ్రైయిన్లు సైతం లేవని దాంతో ముగురునీరు రోడ్డు పైకి చేరి నడిచేందుకు కూడా వీలులేకుండా ఉందన్నారు. కాలనీలకి వేళ్ళే ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న లింకు రోడ్డులో పంట కాలువపై కల్వర్టు నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. విద్యుత్ స్థంబాలకు లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాల పాలవుతున్నామని వాపోయారు. అధికార్లు స్పందించి ఈ కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని కోరారు.

## మత్స్యకారులను పరామర్శించిన గంపల గిరిధర్



విశాఖపట్నం: పెథాయ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన మత్స్యకారులను జనసేన దక్షిణనియోజకవర్గం నాయకులు, రాష్ట్ర జాయింట్ కో ఆర్గినేటర్ గంపల గిరిధర్ మంగళవారం ఉదయం పరామర్శించారు. ఇటీవల పలువురు జాలర్లు గల్లంతుకావడంతో పాటు తీరం ఒడ్డున ఉన్న మత్స్యకారులు గాలులు, వర్షాలు కారంణంగా నష్టపోయిన సంగతి తెలిసిందే ఈ మేరకు హార్బర్ వద్ద మత్స్యకారులను గిరిధర్ పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వారిని ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ సందర్భాలలో మత్స్యకారులను ప్రతిఒక్కరూ ఆదుకోవాలని, ప్రభుత్వం మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి కృషిచేయడంలేదన్నారు. మత్స్యకారులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, ఇదే విషయాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ప్రకటించారన్నారు. మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు వచ్చిన పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని గిరిధర్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జనసేన అధికారంలోకి వస్తే మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరగుతుందని ఆయన బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, గిరిధర్ అభిమానులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## పంటనష్ట పరిహారం చెల్లించాలి

అరకులోయ: మండలం చోంపి పంచాయతీలో రెండ, మూడు గ్రామాల రైతుల చోడిపంట,మరియు వలిసేలు సోమవారం కురిసిన పెథాయ్ తుపాను వల్ల పూర్తిగా పంట దెబ్బ తినటంతో రైతులు కన్నీరు పెట్టారు. ముక్యంగా చోంపి గ్రామంలో పొద్దు.లక్ష్మన్న, కమిడి.పొట్టిగా, పొద్దు.చుచయి, తదితర రైతుల చోడి కుప్పలు పూర్తిగా నాని పోయాయి అలగే కోత కోసినా వలసి పంట పూర్తిగా నేల మీదే తడిసి ముద్దావడంతో రైతుల గుండెల్లో కష్టాలు ఎదురయ్యాయి అని ఆవేదన పడుతున్నారు. గిరి రైతుల పంటలు చేతి కొచిన పంటలు పెథాయ్ తుపాన్ వల్ల చెయ్యి జారి పోవడంతో ప్రభుత్వం వారు తమర్ని ఆదుకొని పంట నష్ట పరిహారం చెల్లించాలి అని తెలిపారు.

## దేవాలయంలో మంత్రి మల్లాడి పూజలు

యానాం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్నారావు పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో వేదపండితులు అర్చకలు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మల్లాడి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన పుదుచ్చేరి బయలుదేరి వెళ్ళారు. యానాం నుండి రోడ్డు మార్గంగా విశాఖకు చేరుకొని అక్కడ నుండి విమానంలో చెన్నై చేరుకొని అక్కడ నుండి రొడ్డు మార్గంగా పుదుచ్చేరి వెళ్ళారు. ఈ నెల 21న తిరిగి యానాం రానున్నట్లు మంత్రి మల్లాడి తెలిపారు. ఈ నెల 15న యూత్ క్రిస్టమస్ వేడకలకు వచ్చిన ఆయన పథాయ్ తుపాను ప్రభావం వలన తీరప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తంచేసే కార్యక్రమంలో బిజీగా గడిపి తుపాను తీరందాటిని ఒక రోజు యానాంలో ప్రజా సమస్యలపై గడిపి పుదుచ్చేరి బయలుదేరి వెళ్ళారు.

## దేవాలయానికి వెండి బహూకరణ

యానాం: అతి పురాతన దేవాలయం అయన శ్రీ వెంకటేశ్వరా స్వామి అలయానికి ఒక భక్తుడు వెండి బహుకరించారు. మంగళవారం ఉదయం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో యానాంకు చెందిన అద్దంకి శ్రీరవి వెంకటతేజకు కుమారుడు పుట్టిన శుభ సందర్భంగా రూ. 30 వేలు విలువచేసే వెండి జల్లెడ, వెండి శంఖం బహుకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కాపుగంటి ఉమాశంకర్, ఉపాధ్యక్షులు గందం శంకరరావు, కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు, కోశాధికారి కె. వెంకటేశ్వరరావు, సభ్యులు కె. గాంధీ, వెంకటతేజ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పు రైతులను, మత్స్యకారులను ఆదుకోవాలి



అచ్యుతాపురం :పైథాయ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ,మత్స్యకారులను ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన మండలంలో పూడిమడక గ్రామంలో పర్యటించారు .ఆయన మాట్లడుతూ తుపాను ప్రభావంతో ఉప్పు మడులు నీట మునిగిపోయి ,పండిన ఉప్పు వర్షాలకు కరిగిపోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేసారు .వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేసారు . అలాగే మత్స్యకారులు తుపాను వల్ల గత 5 రోజులు నుండి చేపలవేటకు వెళ్లకపోవడంతో తినడానికి తిండి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అందువల్ల వెంటనె అధికారులు స్పందించి మత్స్యకార కుటంబాలకు 100 కేజీల బియ్యం ,5 కేజీల కందిపప్పు ,నిత్యావసర వస్తువులను పంపిణి చేయాలని డిమాండ్ చేసారు .ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

### పారిశ్రామిక ప్రాంతంలో

## ఘనంగా ముక్కోటీ ఏకాదశి మహోత్సవాలు



మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం, మల్కాపురంలోని కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 47వ వార్డు మాజీ సైనికులకాలనీ లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలలో 46వ వార్డు టి.డి.పి అధ్యక్షుడు కోరాడ.శ్రీను, మజ్జి.రమేష్ దంపతులు, తోసంగి వెంకటరమణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు

### నేడు తనుమళ్ళలో

## రావాలిజగన్, కావాలిజగన్

కాజులూరు: రావాలిజగన్, కావాలిజగన్ కార్యక్రమాన్ని బుధవారం తనుమళ్ళలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు మంగళవారం గొల్లపాలెం విలేఖరులకు తెలిపారు. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఇంటింటికి వెళ్ళి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన నవరత్నాలు పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు. పార్టీ కార్యకర్తలు నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మన్యంలో పెథాయ్ తుపాన్ వచింది పాఠశాల భవనాలు లేవు గిరిజన చిన్నారులు మాత్రం పూరిపాకలోనే చలికి, గాలికి, పెద్దపెద్ద తుపానులకు భయ పడకుండ చదువును అభ్యసిస్తుంటే చూసిన ఎవ్వరికైనా గుండె కోసుకున్నాంత బాధ అనిపిస్తుంది. ఇలాంటి పాఠశాల భవనాలు లేని గ్రామలెన్నో ఉన్న అధికారులకు పట్టటం లేదు. అరకులోయలో ఇలాంటి పూరిపాకలో చదువులు ఎన్నో దర్శన మిస్తూనే ఉన్నాయి.

## మీడియా ఎప్పుడూ ప్రజల పక్షాన ఉండాలి

### - డాక్టర్ శీను నాయక్




విశాఖపట్నం: మీడియా అన్ని వేళలా ప్రజల పక్షం వైపే ఉండాలని ప్రముఖ డాక్టర్ శీను నాయక్ పేర్కొన్నారు నగరంలోని భవాని రెసిడెన్సీ లో మంగళవారం స్టేట్ ఎడిటర్స్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీను నాయక్ మాట్లాడుతూ మీడియా సశీస్థలన్నీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉండాల న్నారు. మీడియా ప్రజల వైపే ఉండాలని ప్రభుత్వాన్ని పడగొట్టాలన్న, నిలబెట్టాలన్న అది ఒక మీడియా కే సాధ్యమవుతుందన్నారు. పత్రికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉండాలన్నారు. జర్నలిస్టులు మానసిక క్షోభకు గురవుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు జగన్నాటి మహేష్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవ డం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా చక్రం దినేష్ కుమార్ సెక్రటరీగా వెంకట చలపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెంచల నరసయ్య, జాయింట్ సెక్రటరీ నశీర్, సలహాదారుడిగా బాలరాజు, కోశాధికారిగా జగన్నాటిసుజని, రాష్ట్ర మహిళా కన్వీనర్ గా సరస్వతి, జిల్లా మహిళా కన్వీనర్ గా ప్రవీణ, జిల్లా ఉపాధ్యక్షుడు హజరత్ ఎన్ను కోవడం జరిగింది.

## దాడి రాకతో వైకాపలో ఊపు..



మల్కాపురం: మాజీ డిప్యూటీ మేయర్‌గా, ఏకదాటి కార్పొరేటర్‌గా పాలించిన దాడి సత్య నారాయణ ఇంత వరకు రాజకీయాలకు దూరం గా ఉంటు, నిశ్వర్ధంగా పనిచేశారు. త్వరలో ఎన్నికలు సమీపిస్తుండడంతో మరలా రాజకీయ తెర మీదకు మెరుపు తీగ వలె ప్రత్యక్షమయ్యా రు. దీంతో వైసిపి నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహం పెరిగింది. సుధీర్ఘకాలం డిప్యూటీ మేయర్‌గా పారిశ్రామిక ప్రాంత ప్రజలకు విశేష సేవలందించిన వ్యక్తిగా దాడి సత్యనారాయణ సుపరిచితుడు. ఈనాడు పారిశ్రామిక ప్రాంత ప్రజలు కుటుంబంతో సుఖంగా ఉన్నారంటే అది ఆయన చేసిన సేవల వల్లనే అని చేప్పాలి. ఏంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తిచేసి తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. ప్రజలకు త్రాగునీరు, మురికికాలవల పరిశుభ్రత, ఇళ్ళపట్టాలు, తదితర చర్యలు చేపట్టి ఈనాడు పార్టీలో ఒక ఐకాన్‌గా మారాడు. ప్రస్తుతం వైసిపిలో ఎదురులేని నాయకుడిగా అడుగుపెట్టి పార్టీకి సంబందించిన ప్రతీ కార్యక్రమాలలోనూ ఉత్సాహంగా పాల్గొంటున్నా రు. పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని వార్డు ప్రజలు దాడి సత్యనారాయణ అంటే ఎనలేని అభిమానం, అంతులేని అప్యాయత. దీనికి కారణం డిప్యూటీ మేయర్‌గా ఆయన ప్రజలకు చేసిన సేవలు. ప్రస్తుతం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సిపి గెలుపే ద్యేయంగా నిస్వార్ధంగా పనిచేస్తున్న వ్యక్తి ఆయన. దాడి రాకతో వైసిపిలో కొత్త ఊపందుకుంటే, ఇతర పార్టీలకు చెందిన నాయకులలో మాత్రం కొత్త దడ పుట్టుకుంది. ఏదీఏమైనా వైసిపికి దాడి రాక ఒక శుభ పరిణామంలా గోచరిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## నష్టపోయిన వారిని ఆదుకోవాలి : జిల్లా సిపిఎం

విశాఖపట్నం: పెథాయ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన వారిని ఆదుకోవాలని కోరుతూ డి.ఆర్.ఒ.కి సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, డి.వెంకన్నలు ఒక వినతిపత్రం సమర్పించారు.

విశాఖ జిల్లాలో పెథాయ్ తుఫాన్ కారణంగా తీరం, మైదానం, ఏజెన్సీ ప్రాంతాల్లో ఈదురు గాలులు, వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళలేని పరిస్థితులు వున్నారు. వరి, చెరకు, అరటి తోటలు, కొబ్బరిచెట్లు, కూరగాయలు, తమల పాకులు, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలన్నింటినీ గుర్తించి రైతులకు పూర్తి నష్టపరిహారం అందజేయాలి. వర్షాలతో పనుల్లేక పేదల జీవనోపాధి దెబ్బతిన్నది. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన ప్రతీ కుటుం బానికి 50 కేజీల బియ్యం, 5 కేజీల కందిపప్పు ఇవ్వాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పనులు చేపట్టాలి. మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరుతూ పత్రం సమర్పించారు.

## కన్యకాపరమేశ్వరి ఆలయకమిటీ అధ్యక్షుడిగా కలగర్ల ...



చోడవరం : చోడవరం పట్టణంలో వేంచేసిన పురాతన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కలగర్ల శేషగిరిరావుకు వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ ఎస్వీ మాధవ, సభ్యులు అభినందనలు తెలియజేసారు. కొత్త కమిటీ కార్యవర్గానికి అభినందనలు తెలియజేసే కార్యక్రమాన్ని ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ ఎస్వీ మాధవ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల మనోభావాలకు అంతరాయం కలగకుండా నిర్వహణ కమిటీ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ కార్యదర్శి టి.వి.రామ్మూర్తి, కోశాధికారి నున్న నాగేశ్వరరావు, వాసవీ క్లబ్ అధ్యక్షులు పి.ఎస్.కె.గుప్త, వాసు తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## నా ఫేవరేట్ హీరో బాలకృష్ణ..

### చిరంజీవిని మళ్లీ కెలికిన తమ్మారెడ్డి..



దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడటం తెలిసిందే. తాను ఫీలైన విషయాన్ని ఎలాంటి తడబాటు లేకుండా వెల్లడిస్తుంటారు. ఇటీవల ప్రముఖ హాస్య నటుడు అలీ నిర్వహించే కార్యక్రమానికి హాజరైన తమ్మారెడ్డి మాట్లాడుతూ.. తనకు నచ్చిన హీరో బాలకృష్ణ అని వెల్లడించారు. కానీ చిరంజీవితో తనకు అనుబంధం ఉన్నప్పటికీ కొన్ని విషయాల్లో బాలయ్య నచ్చాడని చెప్పారు. బాలకృష్ణ నచ్చడానికి కారణాలు చెబుతూ..

నాకు తెలుగు హీరోలలో బాలకృష్ణ, చిరంజీవితో చాలా మంచి రిలేషన్ ఉంది. ఇద్దరిలో ఎవరు ఇష్టమంటే నాకు బాలకృష్ణ అని చెబుతాను. ఎందుకంటే టాప్ హీరోలుగా ఎదిగిన తర్వాత కొందరి యాటిట్యూడ్ వస్తుంది. అలాంటి యాటిట్యూడ్, ఎలాంటి ఇగో లేని హీరో బాలకృష్ణ. ఆయనతో నాకు పెద్దగా పరిచయం కూడా లేదు. చిరంజీవితో రిలేషన్ ఇక బాలకృష్ణ కంటే చిరంజీవితో నాకు రిలేషన్‌షిప్ ఉంది. హీరోగా నిలదొక్కుకునే సమయం నుంచి చిరంజీవితో పరిచయం ఉంది. ఆయన రూంలో నేను ఉండేవాడిని. మా ఆఫీస్‌కు అక్కడే చిరంజీవి పడుకొనేవాడు. చిరంజీవి కారును నేనే స్వయంగా నడిపే వాడిని. మెగాస్టార్‌గా మారిన తర్వాత చిరంజీవి మారిపోయాడు. ఆ తర్వాత సంబంధాలు తగ్గిపోయాయి. బాలకృష్ణ మనస్తత్వం నచ్చింది ఎన్టీఆర్ తనయుడిగా బాలకృష్ణ తెలుసు. కానీ నేరుగా పరిచయం లేదు. కానీ ఆయన మనస్తత్వం అంటే నాకు ఇష్టం. ఆయన ఎందుకు నచ్చాడంటే. తెలుగు పరిశ్రమ 75 ఏళ్ల ఫంక్షన్ చేసినప్పుడు బాలకృష్ణ వ్యవహరించి తీరు ఆకట్టుకొన్నది. దాంతో నాకు మంచి రిలేషన్ ఏర్పడింది. ఆ ఫంక్షన్‌లో హీరోలు అలా 75 ఏళ్ల ఫంక్షన్ సమయంలో పది రోజులకుపైగా హీరోలతో రిహార్సల్, ఇతర పనులను నేనే పర్యవేక్షించాను. చాలా మంది హీరోలు యాటిట్యూడ్ చూపించారు. సమయానికి వచ్చే వాళ్లు కాదు. వచ్చినా వాళ్లకు నచ్చినట్టు ప్రవర్తించే వాళ్లు. కానీ బాలకృష్ణ మాత్రం సాధారణ వ్యక్తిలా బిహేవ్ చేశారు. బాలకృష్ణ సమయ పాలన బాలకృష్ణ ప్రతీ రోజు ఉదయం 7 గంటలకే వచ్చే వాడు. సాయంత్రం వెళ్లేటప్పుడు చెప్పి వెళ్లడమే కాకుండా మరుసటి రోజు ఎప్పుడు రావాలని అడిగేవాడు. చాలా సాదాసీదాగా ఉండేవాడు. ఆ సమయంలో క్రమశిక్షణ, సింప్లిసిటీ నాకు బాగా నచ్చింది. అందుకే నాకు బాలకృష్ణ వ్యక్తిగతంగా బాగా నచ్చాడు. పవన్ కల్యాణ్ అలా మొండిపట్టు 75 ఏళ్ల ఫంక్షన్‌లో పవన్ కల్యాణ్ డ్యాన్స్ చేయనని మొండికేశాడు. కానీ నేను పట్టుబట్టి పవన్ కల్యాణ్ చేయాల్సిందేనని అన్నాను. దాంతో శంకర్ దాదా పాటకు శ్రీకాంత్ స్థానంలో పవన్ కల్యాణ్ చేసేలా ఒప్పించాను. ఆ పాటకు పవన్ కల్యాణ్ డ్యాన్స్ చేయడంతో గొప్పగా ప్రశంసలు వచ్చాయి.



## ముద్దు ఇవ్వాల్సి వస్తే అతడికే..

తమిళ హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ కు డేరింగ్ నటిగా పేరుంది. కేవలం హీరోయిన్ పాత్రలే కాకుండా.. విలన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా వరలక్ష్మి శరత్ కుమార్ రాణిస్తోంది. ఎలాంటి పాత్రలో అయినా ఒదిగిపోయి నటించడం వరలక్ష్మి శరత్ కుమార్ ప్రత్యేకత. ఇటీవల వరలక్ష్మి సర్కార్ చిత్రంలో పోషించిన విలన్ పాత్రకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సర్కార్ చిత్రం భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇటీవల వరలక్ష్మి శరత్ కుమార్ ఓ అవార్డుల వేడుకలో పాల్గొంది. ఆ వేదికపై వరలక్ష్మి విశాల్, శింబుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సినిమా అవార్డుల ఫంక్షన్స్ చాలా సరదాగా జరుగుతుంటాయి. అలాగే ఈ వేడుకలో కూడా యాంకర్ వరలక్ష్మిని ఆసక్తికరమైన ప్రశ్న అడిగింది. ముద్దు ఇవ్వాల్సి వస్తే, ఒకరిని చంపాల్సి వస్తే, ఒకరిని వివాహం చేసుకోవాల్సి వస్తే ఈ మూడు అంశాలలో మీ ఛాయిస్ ఎవరు అని యాంకర్ వరలక్ష్మిని ప్రశ్నించింది.ముగ్గురి పేర్లు చెప్పాలని కోరింది. ఈ ప్రశ్నకు వరలక్ష్మి ఏమాత్రం మొహమాట పడకుండా ఆసక్తికర సమాధానం ఇచ్చింది. ముద్దు మాత్రం అతడికే తాను ముద్దు ఇవ్వాల్సి వస్తే హీరో శింబుకి మాత్రమే ఇస్తానని వరలక్ష్మి శరత్ కుమార్ స్పష్టం చేసింది. ఇక చంపాలని అనిపించినంత కోపం వచ్చినప్పుడు మాత్రం విశాల్ నే టార్గెట్ చేస్తానని సరదాగా వ్యాఖ్యానించడం విశేషం. ఇక పెళ్లి చేసుకోబోయే వ్యక్తి పేరు మాత్రం తాను ఇప్పుడే చెప్పనని వరలక్ష్మి తెలిపింది.

ప్రస్తుతం వరలక్ష్మి చేతినిండా సినిమాలతో బిజీగా గడుపుతోంది. విశాల్‌తో ఎఫైర్ చాలా రోజులుగా విశాల్, వరలక్ష్మి శరత్ కుమార్ మధ్య ఎఫైర్ సాగుతోందంటూ వార్తలు వస్తున్నాయి. త్వరలో వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కూడా ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలని అటు విశాల్, ఇటు వరలక్ష్మి ఇద్దరూ ఖండించారు. తామిద్దరం మంచి స్నేహితులం అని తెలిపారు. విశాల్ పందెం కోడి 2 చిత్రంలో కూడా వరలక్ష్మి ప్రతినాయకగా నటించింది. శింబు చిత్రంతో శింబు సరసన పోడాపోడి చిత్రంలో వరలక్ష్మి హీరోయిన్ గా నటించింది. ఇదే వరలక్ష్మికి డెబ్యూ మూవీ కావడం విశేషం. ప్రస్తుతం వరలక్ష్మి ధనుష్ మారి 2 చిత్రంలో నటిస్తోంది. ఈ నెల 21 న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. సినిమాల్లో గ్లామర్ పాత్రలకు తాను సిద్దమే అని, కాని కేవలం గ్లామర్ కోసమే సినిమా అంటే మాత్రం ఒప్పుకోనని ఇటీవల వరలక్ష్మి తెలిపింది.

## ఈ సినిమా కూడా ఫ్లాప్ అయితే..
## నేను సరైన హిట్ కొట్టి 15ఏళ్ళు అవుతోంది!



బాలీవుడ్ బాద్షా అంటే పిచ్చెక్కిపోయే అభిమానులు ఉన్నారు. దశాబ్దాల కాలంగా తన నటన, ప్రత్యేకమైన స్టైల్ తో షారుఖ్ అభిమానులని అలరిస్తున్నాడు. షారుఖ్ నటించిన తాజా చిత్రం జీరో డిసెంబర్ 21న విడుదల కానుంది. షారుఖ్ ఈ చిత్రంలో శారీరక వైకల్యం ఉన్న యువకుడిపాత్రలో నటిస్తున్నాడు. కత్రినా కైఫ్, అనుష్క శర్మ నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ప్రస్తుతం జీరో చిత్ర ప్రచార కార్యక్రమాల్లో షారుఖ్ బిజీగా పాల్గొంటున్నాడు. జీరో చిత్రం గురించి, తన సినిమా కెరీర్ గురించి షారుఖ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరమైన చర్చకు దారితీసాయి.

బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుఖ్ కు పరాజయాల బెడద తప్పడం లేదు. గత కొనేళ్ళుగా షారుఖ్ నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా నిరాశపరుస్తున్నాయి. రాయీస్, ఫ్యాన్, దిల్ వాలే లాంటి చిత్రాలు తీవ్రంగా నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో తెరకెక్కిన జబ్ హ్యారీమెట్ సెజల్ చిత్రం 90 కోట్ల భారీ బడ్జెట్ లో తెరకెక్కి కేవలం 60 కోట్ల వసూళ్లకు మాత్రమే పరిమితం అయింది. జీరోపై భారీ అంచనాలు ఎన్ని పరాజయాలు ఎదురైనా షారుఖ్ సినిమాల జోరు మాత్రం తగ్గడం లేదు. ప్రతి ఏడాది ఒకటో రెండో సినిమాలతో షారుఖ్ ఆడియన్స్ ముందుకు వస్తున్నాడు. విభిన్నమైన కథతో తెరకెక్కిన జీరో చిత్రంపై షారుఖ్ భారీగా ఆశలు పెట్టుకుని ఉన్నాడు. అభిమానుల్లో కూడా ఈ చిత్రంపై అంతే క్రేజ్ నెలకొంది ఉంది. తన కెరీర్ కు చాలా కీలకమైన చిత్రం గురించి ఓ ఇంటర్వ్యూలో షారుఖ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ సినిమా ఫ్లాప్ అయితే నేను అభిమానులకు సరైన హిట్ అందించి 15 ఏళ్ళు గడుస్తోంది. భారీ విజయం కోసం ప్రయత్నిస్తున్నాను కానీ కుదరడం లేదు అని షారుఖ్ తెలిపాడు. శుక్రవారం విడుదల కాబోతున్న జీరో చిత్ర ఫలితం ఎలా ఉండబోతోందో కూడా నాకు తెలియదు. వచ్చే ఫలితాన్ని నేను మార్చలేను. కాబట్టి సినిమాల ఫలితం గురించి తానెప్పుడూ బెంగ పెట్టుకొనని షారుఖ్ అన్నారు. జీరో చిత్రం ఫెయిల్ అయితే ఏమవుతుంది.. మహా అయితే 6 నుంచి 10 నెలల పాటు ఖాళీగా ఉంటాను అంతే అని షారుఖ్ అన్నారు. నా నైపుణ్యం నా నైపుణ్యానికి, నటనకు విలువ ఉన్నన్ని రోజులు సినిమా చేస్తూనే ఉంటానని షారుఖ్ తెలిపారు. ఆనంద్ ఎల్ రాయ్ ఈ చిత్రానికి దర్శకుడు. కత్రినా కైఫ్ ఈ చిత్రంలో మద్యానికి బానిసైన నటి పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అనుష్క శర్మ సైంటిస్ట్ పాత్రలో కనిపించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.





## ఆకతాయికి తాప్సి దిమ్మతిరిగేలా!



పలు సందర్భాల్లో హీరోయిన్లు నెటిజన్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది సెలెబ్రిటీలు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ ని పట్టించుకోరు. కానీ కొన్ని సందర్భాల్లో మాత్రం పట్టించుకోక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. పలు సందర్భాల్లో హీరోయిన్ తాప్సి సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్ కు గురైంది. ప్రతి సారి తనని విమర్శించే వారికీ తాప్సి ధీటుగా సమాధానం ఇస్తోంది. తాజాగా ఓ నెటిజన్ ట్విట్టర్ వేదికగా తాప్సి గురించి అసభ్యంగా కామెంట్ చేశాడు. అతడికి తాప్సి దిమ్మ తిరిగే కౌంటర్ ఇవ్వడంతో అభిమానులు తాప్సిని ప్రశంసిస్తున్నారు.

ఓ నెటిజన్ తాప్సి గురించి ట్వీట్ చేయడం, దానికి తాప్సి ఘాటుగా సమాధానం ఇవ్వడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాప్సి.. నీ బాడీ పార్ట్స్ అంటే చాలా ఇష్టం అని కామెంట్ పెట్టాడు. ఇంత అసభ్యంగా కామెంట్ చేసిన అతడికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుందో ఏమో కానీ సింపుల్ గా, అదిరిపోయే రిప్లై ఇచ్చింది. ఈ రిప్లై తో తాప్సి సమయ స్ఫూర్తి మరోమారు బయటపడిందని నెటిజన్లు అంటున్నారు.

నా బాడీ పార్ట్స్ అంటే ఇష్టమా.. నేను కూడా నా శరీర భాగాలని ఇష్టపడతాను.. నీకు ఏ పార్ట్ అంటే ఇష్టం. నాకు మాత్రం అన్నింటికన్నా మస్తిష్కం అంటే ఇష్టం అని తెలిపింది. తనకు బుద్ధి ఉన్న వాళ్లంటే ఇష్టం అని తాప్సి ఇలా ఘాటుగా అతడికి కౌటర్ ఇచ్చింది. మరొకసారి అతడు వల్గర్ కామెంట్స్ చేయకుండా నోరు మూయించింది. బులెట్ దెబ్బ కన్నా వెయ్యి రెట్లు బులెట్ దెబ్బకన్నా తాప్సి రిప్లై వెయ్యి రెట్లు అదిరిపోయింది. ఆ వేదవకు కనీసం అతడి ఫోటో పెట్టె ధైర్యం కూడాలేదు అని ఓ నెటిజన్ తాప్సిని ప్రశంసించాడు. తాప్సి మరోమారు తన కూల్‌నెస్ ని బయటపెట్టింది మరికొందరు ప్రశంసిస్తున్నారు. బాలీవుడ్ చిత్రాలతో ప్రస్తుతం తాప్సి బాలీవుడ్ అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. అక్షయ్ కుమార్ నటిస్తున్న మిషన్ మంగళ్ చిత్రమో తాప్సి అవకాశం దక్కించుకుంది. విభిన్న చిత్రాల్లో అవకాశాలు అందుకుంటోంది కానీ గ్లామర్ పాత్రలు మాత్రం తాప్సికి దక్కడం లేదు. తాప్సి టాలీవుడ్ కు పూర్తిగా దూరం కావడంతో ఇక్కడ బాగా సన్నగిల్లాయి. తాప్సి చివరగా తెలుగులో నటించిన చిత్రం నీవెవరో.

## నేడు ఉత్తరద్వారంలో దర్శనమివ్వనున్న అప్పన్న

వేకువజామున 3 గంటలకు మెట్లమార్గంలో దీపోత్సవం ప్రారంభం





సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి కొలువైవున్న సింహగిరిపై బుధవారం వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి సర్వంసిద్ధం అయ్యింది. దేవస్థానం ఈ. ఓ కె. రామచంద్రమోహన్ పర్యవేక్షణలో విస్తృత ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువ జామున స్వామి వారిని సుప్రభాతసేవ . అనంతరం ధూపసేవ . సేవాకాలం . ధనుర్మాస తిరుప్పావై పాసుర విన్నపం .ప్రభాత ఆరాధనలు నిర్వహిస్తారు . అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులైన గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులను స్వర్ణాభరణాలుతో సర్వాంగ సుందరంగా వైకుంఠవాసునిగా అలంకరించి పల్లకీలో వుంచి అయ్యవారి సేవను నిర్వహిస్తారు.

4 గంటలకు మంగళ నీరాజనాలు సమర్పించిన అనంతరం ఉత్తర ద్వారంలో స్వామివారి తొలి దర్శనాన్ని అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోకగజపతి రాజు దంపతులకు కల్పించనున్నారు. అనంతరం ఉత్తర రాజ గోపురం నుండి వైకుంఠ వాసునిగా అప్పన్న స్వామి శేషతల్పవాహనంపై భక్తులకు ఉదయం 5 గంటలనుండి 11 గంటల వరకు దర్శనమిస్తారు . ఈ ఉత్సవానికి సంబంధించి ఆలయాన్ని పూలతో అలంకరించారు .భక్తులు క్యూ లైన్‌లో నడుస్తూ 20 నిముషాలపాటు స్వామిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. 50 వేలమంది భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు . వేకువ జామున 3 గంటలకు కొండమెట్ల మార్గం తొలిపావంచ వద్ద నుండి దీపోత్సవం ప్రారంభం. కావున భక్తులెల్లరు పాల్గొనాల్సిందిగా అధికారులు కోరారు .

## ట్యాంపరింగ్ బాబుకు బాగా తెలుసు

ప్రత్యేక హెూదా సాధనపై టీడీపీకి శ్రద్ధలేదు



ఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు పార్ల మెంట్ ముందుగల గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. మంగళవారం రాజ్యసభ సమావేశాలు ప్రారంభం కాగానే.. విజయ సాయిరెడ్డి స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. విపక్షాల నినాదాల హోరుతో పార్లమెంటు ఉభయ సభలూ వాయిదా పడడంతో పార్టీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేక హోదా సాధనపై టీడీపీ ఎంపీలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సభలో టీడీపీ ఎంపీలు కనీసం నిరసన కూడా వ్యక్తం చేయడంలేదని, కొందరు సభ్యులు అసలు సమావేశాలకు కూడా హాజరు కావడం లేదని ఆయన మండిపడ్డారు. గత ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌పీసీ కంటే 5 లక్షల ఓట్లు ఎక్కువ రాబట్టుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈసారి మాత్రం బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరపాలని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. ఈవీఎంలకు ట్యాంపరింగ్ చేయడం బాబుకు బాగా తెలుసనని, ఇప్పుడు ఆయన ఎత్తులు సాగవని తెలిసి ముందే భయపడుతున్నారని అన్నారు. ఏపీలో తుపానుతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు మాత్రం ప్రమాణా స్వీకారాల కోసం యాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

## రాజకీయ లబ్ధికోసం దేశప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షునిగా రాహుల్ గాంధీని తొలగించాలి

ఎమ్మార్వోను కలిసిన బిజెపి నాయకులు



విశాఖపట్నంః రఫెల్ యుద్ధ విమానాలు కొనుగోలుపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సుప్రీంలో కేసు వేసి దేశ ప్రతిష్ఠను దెబ్బ తీశారని, అందుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షునిగా రాహుల్ గాంధీని పదవినుంచి తొలగించాలనా జనతా పార్టీ నగర అధ్యక్షుడు వీ నాగేంద్ర మరియు పార్టీ నాయకులు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఎంఆర్ఓ చంద్ర శేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ నాయకులు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఎంఆర్ఓ చంద్ర శేఖర్ రెడ్డిని కలిసి రఫెల్ ఒప్పందం మీద కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ యొక్క పార్లమెంట్ సభ్యత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి రాసిన లేఖను అందచేశారు. రఫెల్ ఒప్పందంపై ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు స్పందిస్తూ రఫెల్ ఒప్పందంలో ఎటువంటి ఆర్థికపరమైన అవకతవకలు జరగలేదని, నియమనిబంధనలు కేంద్ర ప్రభుత్వం పాటించింది అని పేర్కొంది. అసత్య ఆరోపణల ఆధారంగా దేశ రక్షణ వంటి సున్నితమైన అంశాలను కోర్టు వద్దకు తీసుకు రాకూడదని సందేశాన్నిచ్చింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌ను కొట్టివేసి రఫెల్ యుద్ధ విమానాలు దేశ రక్షణకు అవసరమని తెలియచేసింది. సుప్రీం కోర్టు రఫెల్ ఒప్పందంపై సంతృప్తి చెందిందని మరియు ఆర్థికపరమైన అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా ఉందని పేర్కొంది. వ్యక్తిగత అభిప్రాయాలు పరిగణనలోకి రావు అని తేల్చిచెప్పింది. 2001లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో ఉన్న సమయంలో యుద్ధ విమానాలు కొనుగోలు చేయడం ఆలస్యం చేసిందని, భారతీయ జనతా పార్టీ కేంద్రలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ యుద్ధ విమానాల కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ విమానాల కొనుగోలు ఆలస్యం చేసిందని, ఇప్పుడు దేశ ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తోంది అని లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కేవలం రాజకీయ లబ్ధి కొరకు ఇటువంటి ఆరోపణలను చేస్తున్నారని, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దిగజారుస్తున్నారు అని లేఖలో పేర్కొన్నారు. కేవలం రాజకీయ లబ్ది కొరకు దేశ రక్షణ వంటి సున్నితమైన విషయాలపై అసత్య ఆరోపణలు చేయడం వల్ల అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట దెబ్బ తీశారు అని అందుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీని లోక్‌సభ సభ్యునిగా తొలిగించాలని నగర అధ్యక్షుడు వీ నాగేంద్ర ఈ లేఖ ద్వారా డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధా చంద్ర శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.సి. నాయుడు, నగర ఉపాధ్యక్షుడు శాంతారావు, బొడ్డేటి రవి కుమార్, కె.వి. కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాబుకు పోలవరం బంగారు బాతులాంటిది

- 40 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఏం సాధించారు?
- జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటన
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ



అమరావతి : నలభైఏళ్ల రాజకీయ అనుభవమని చెప్పుకునే చంద్రబాబు నాయుడు తన అనుభవంతో ఏం సాధించారని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. తన బతుకంతా వాళ్లనీ, వీళ్లనీ విమర్శించడం తప్ప సాధించిందేమీ లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓటుకునోటు వంటి కేసుల్లో ఇరుక్కొని పక్క రాష్ట్రం నుంచి పారిపోయి వచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను ఏపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టును కేవలం దోచుకోవడం కోసమే నిర్మిస్తున్నారని మండిపడ్డారు. ఆ ప్రాజెక్టు ఆయనకు బంగారు బాతులా మారిందని అన్నారు.

సమావేశంలో కన్నా మాట్లాడుతూ.. చంద్రబాబు బతుకంతా ఇతరులను తిట్టడానికి సరిపోయింది. వట్టి గాలి మాటలు తప్ప ఆయన సాధించింది ఏమీ లేదు. గడిచిన ఐదేళ్ల కాలంలో అగ్రిగోల్డ్, భూకుంభకోణం, జన్మభూమి కమిటీ వంటి అనేక కుంభకోణాలు వెలుగు చుశాయి. చంద్రబాబు దురాగతాలను కప్పిపుచ్చడానికి ఓ వార్త ఛానల్ మాపై అనేక అరోపణలు చేస్తోంది. మీకు కుల పిచ్చి ఉంటే, వారిని కాపాడుకోండి. కానీ మాపై, ప్రధాని నరేంద్ర మోదీపై తప్పుడు వార్తలను మాత్రం ప్రచురించకండి అని అన్నారు. రాఫెల్ విషయంలో కేంద్రంపై విమర్శలు చేసినవారంతా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. మన శత్రుదేశాలైన చైనా, పాకిస్తాన్‌లతో రాహుల్ గాంధీ రహస్య చర్చలు జరిపారు. మిమల్ని ప్రజలు క్షమించరు.

జనవరి 6న నరేంద్ర మోదీ ఏపీ పర్యటకు వస్తున్నారు. గుంటూరులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నాం. సభ ద్వారా రాష్ట్రానికి ఇచ్చిన నిధుల లెక్కల్ని బయటపెడుతాం అని పేర్కొన్నారు.

## ఆసీస్‌ను అడ్డుకోవడంలో విఫలమయ్యాం

టీమిండియా సారథి విరాట్ కోహ్లీ

పెర్త్: ఆసీస్‌తో జరిగిన రెండో టెస్టులో టీమిండియా ఘోర పరాజయం పాలైంది. 146 పరుగుల భారీ తేడాతో గెలిచిన ఆసీస్ నాలుగు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. అయితే టీమిండియా పెర్త్ వేదికమీద విఫలం కావడంపై సారథి విరాట్ కోహ్లీ మ్యాచ్ ముగిసిన అనంతరం కోహ్లీ మీడియాతో మాట్లాడాడు. టీమిండియా జట్టు పరంగా బాగా పోరాడిందని, కానీ ఆసీస్‌ను నిలవరించడంలో స్వల్పంగా విఫలమయ్యామని అన్నాడు.

ANNAMALAI UNIVERSITY
Directorate of Distance Education
COURSES OFFERED
B.A., B.Com, BBA, BCA, B.Sc, M.A., M.Com., M.Sc., B.Lisc., M.Lisc.,
PG - MBA, MCA, Diploma, PG.Diploma, Computer Science and IT Courses, Industrial Safety, Lateral entry programs
UG & PG Discontinue Students
Direct Eligible Final Year
9603485698, 6281490615

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

## గింజ కూడా నష్టపోకుండా తగు చర్యలు తీసుకుంటాం

- రూ.18.42లక్షలతో గంగినేని ఎత్తిపోతల పథకం
- రూ.57.70లక్షలతో గంగినేనిలో ఇంటింటికీ కుళాయి
- అభివృద్ధి పనులకు అడ్డుపుడుతున్న విపక్షాలు
- జనవరిలో జరుగు జన్మభూమిలో పెద్ద ఎత్తున ఎన్టీఆర్ భరోసా పింఛన్లు
- ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



జి.కొండూరు (గంగినేనిపాలెం) : పెథాయ్ తుఫాన్ సందర్భంగా దెబ్బతిన్న పంటపొలాలలో రైతులు ఒక్క గింజ కూడా నష్టపోకుండా చర్యలు తీసుకుంటానని ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. మంగళవారం నాడు గంగినేనిపాలెంలో జరిగిన గ్రామదర్శిని- గ్రామవికాసం, ఆదరణ ఆధునిక పనిముట్ల పంపిణీ, మండల తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉమా మాట్లాడుతూ, పెథాయ్ తుఫాను రాకను గమనించిన ప్రభుత్వం మూడు రోజుల ముందే ముందస్తు చర్యలు చేపట్టినట్టు, తద్వారా భారీ ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా కాపాడగలిగామని తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్టు ఇందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) అవార్డు నిదర్శనంగా తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీళ్లిచ్చామని తెలిపారు. గంగినేనిపాలెంలో రూ.18.42 లక్షలతో ఎత్తిపోతల పథకంను, రూ.57.70 లక్షలతో ఇంటింటికీ కుళాయి పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. జనవరిలో జరుగు జన్మభూమిలో పెద్ద ఎత్తున ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నట్లు, ఇళ్లు-ఇళ్ల స్థలాల సమస్యలకు పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 15వేల ఇళ్ళ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చెసిందే చెప్తుందని, ఐనా విపక్ష పార్టీలు అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డంపడుతున్నారని ఆరోపించారు. తుఫాన్ల భీభత్సంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పటిష్టమైన చర్యలు తీసుకోవటాన్ని ప్రజలు హర్షిస్తున్నట్లు మంత్రి ఉమా వివరించారు. గంగినేని రాక సందర్భంగా మంత్రి ఉమాను గ్రామస్తులు పొట్టేళ్ళతో బండికట్టి ఊరేగింపు నిర్వహించారు. పొట్టేళ్ళు బండిలాగటం పట్ల వందలాది మంది ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

## దర్శకుని అవతారమెత్తిన జర్నలిస్టు



విశాఖపట్నంః అక్షర సారథి, సీనియర్ జర్నలిస్టు చంద్రశేఖర్ దర్శకత్వం వహించనున్న సినిమా విశాఖలో అతిసుందరంగా జరిగింది. ఎల్. ఆనంద్ నిర్మాతగా ఈ చిత్రానికి వ్యవహరిస్తున్నారు. సునీల్ చరణ్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమంలో స్టార్ మేకర్ సత్యానంద్, వాణిజ్యవేత్త.. నిర్మాత ఎల్. ఆనంద్, సాయి పూజా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వానపల్లి రవి కుమార్, నిర్మాతలైన వామనరావు, తేజ, రాము, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ కాండ్రేగుల ఆదినారాయణ, రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## రఫేల్ విమానాలు అత్యంత ఆవశ్యకం

రఫేల్ ధర వివరాలు వెల్లడించొద్దు

రక్షణ మంత్రికి రాసిన లేఖలో ఐఏఎఫ్ అధికారి

న్యూఢిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు భారత వాయుసేనకు అత్యంత ఆవశ్యకమని, వాటిని కచ్చితంగా కొనుగోలు చేయాలని వైమానిక దళ ఉన్నతాధికారి ఒకరు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఐఏఎఫ్ అధికారి బృందర్ సింగ్ ధనోవా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ఈ లేఖ గత నెల మొదటి వారంలో రాయగా.. తాజాగా వెలుగులోకొచ్చింది. వైమానిక దళంలో ఫైటర్ స్క్వాడ్రన్‌ల (ఒక స్క్వాడ్రన్‌లో 14-16 విమానాలు) బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ధనోవా లేఖలో కోరారు. వైమానిక దళంలో 42 స్క్వాడ్రన్‌ల అవసరం ఉండగా.. ప్రస్తుతం 31 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. వీటితో పశ్చిమ, ఉత్తరాది సరిహద్దుల్లో సమర్థంగా మోహరించేందుకు అవకాశం ఉండదని వెల్లడించారు. కాబట్టి మరో 36 ఫైటర్లు అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. వీటిని సమకూర్చుకోవడంలో అనిశ్చితి ఏర్పడితే రక్షణ పరంగా సవాళ్లను ఎదుర్కోవడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని మరో ఉన్నతాధికారి విశ్వసనీయంగా వెల్లడించారు.

అయితే రఫేల్ జెట్‌లకు సంబంధించి ధర వివరాలను వెల్లడించొద్దని ధనోవా లేఖలో ప్రభుత్వాన్ని కోరారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com